
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

జిల్లా వార్తలు

మంగళవారం 31 డిసెంబరు 2024

2025 ప్రణాళిక.. ఆచరణ

- కొత్త ఏడాది లక్ష్యాలు వివరించిన ప్రజాప్రతినిధులు
- ప్రగతి పరుగు.. సంక్షేమానికి మెరుగు



సంక్షేమం, అభివృద్ధి... ఈ రెండు ఎన్డీఏ కూటమి లక్ష్యం. ఆ లక్ష్యసాధనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుండగా, అందుకు అనుగుణంగా తమ ప్రాంత అభివృద్ధి కోసం జిల్లా ప్రజాప్రతినిధులు కంకణబద్ధుల య్యారు. కాంగ్రెస్, ఆ తరువాత వైసీపీకి కంచుకోటలాంటి జిల్లాలో ఎన్డీఏ కూటమి తరపున బరిలో నిలిచిన టీడీపీ అభ్యర్థుల ను ప్రజలు గెలిపించారు. పజల అభిమానా న్ని, తమపై పెట్టుకున్న నమ్మకాన్ని నిల బెట్టుకునేలా ఎంపీ, ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలో అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. వైసీపీ హయాంలో చతికిలపడ్డ ప్రగతిని తిరిగి పట్టాలెక్కించేం దుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి.. జిల్లాను సస్యశ్యామలం చేసేందు కు శ్రమిస్తామని ప్రతిన బూనుతున్నారు. 2025లో తమ లక్ష్యాలను 'ఆంధ్రజ్యోతి'తో అభిప్రాయాల ను పంచుకున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం

పారిశ్రామిక విప్లవం తెస్తా

2025వ సంవత్సరం పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందుతుంది అనడానికి బీపీసీఎల్ పరిశ్రమ రావడమే నిదర్శనం. చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో రూ.95వేల కోట్లతో ఆ పరిశ్రమకు అనుసంధానంగా మరో 15 అనుబంధ పరిశ్రమలు రాబోతున్నాయి. ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాలో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొని రావడానికి నా వంతు కృషి చేస్తున్నా. ఇప్పటికే పలు కంపెనీలు జిల్లాలో ఏర్పాటుకు అంగీకరించాయి. ఈసీఐఎల్ హాస్పిటల్ ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి అయ్యింది. బిట్రగుంట రైల్వే స్టేషన్ అభివృద్ధికి, అక్కడ రైల్వే అనుబంధ పరిశ్రమలు రావడానికి కేంద్ర మంత్రులతో చర్చిస్తున్నాను. మిథానీ గురించి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లాను. ఆయన సానుకూలంగా స్పందించారు. పలు కేంద్ర ప్రాజెక్టులు జిల్లాకు తీసుకురావడానికి కృషి చేస్తున్నాను. కేంద్ర పథకాల ద్వారా జిల్లాకు అదనపు నిధులు తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టాను. జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన సహాయ సహకారాలను తీసుకురావడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా. అభివృద్ధి ద్వారా నన్ను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా.



- వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు ఎంపీ

నిరుపేద పిల్లలకు అత్యున్నత విద్య

2025లో నా మొదటి ప్రాధాన్యత నిరుపేద విద్యార్థులకు అత్యున్నతమైన విద్య అందించడం. విద్యాసంవత్సరం ఆరంభం నుంచే నెల్లూరు వీఆర్ హైస్కూలు ప్రాంగణంలో 2 వేల మంది పిల్లలకు ఉచిత విద్య, భోజన వసతి కల్పించడం. ఉత్తమ విద్యతోపాటు పిల్లలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, స్కూలు బస్సు సౌకర్యం అన్నీ ఉచితంగానే అందిస్తాం. అంత గొప్పగా ఉండబోతోంది. వ్యక్తిగతంగా కూడా ఇది నాకు, కూటమి ప్రభుత్వానికి చాలా సంతోషాన్ని కలిగించే విషయం. ఇక నెల్లూరు సిటీకి సంబంధించి కొన్ని ముఖ్యమైన పనులు పూర్తి చేయాలి. భూగర్భ డ్రైనేజీ, ఇంటింటికి శుద్ధి జలం పంపిణీ పనులు పూర్తి చేస్తాం. నగరంలోని పార్కులన్నీ అభివృద్ధి చేస్తాం. పేదల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణం. నెల్లూరు నగరంలో సొంత ఇల్లు లేని పేదలు ఉండకూడదు అనేది నా సంకల్పం. ఈ లక్ష్య సాధనలో 2025లో పెద్ద సంఖ్యలో పేదలకు పక్కా ఇళ్ల ఇవ్వాలన్నది నా కోరిక.



- పొంగూరు నారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి, నగర ఎమ్మెల్యే

వ్యవసాయం, రహదారులు, పరిశ్రమలే ప్రాధాన్యం

గతంలో ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఇక్కడ నేను చేసిన అభివృద్ధి పనులు అన్నీ అర్ధంతరంగా ఆగిపోయాయి. వాటిని పూర్తి చేయాలన్నది నా 2025 లక్ష్యం. ఆత్మకూరు రింగ్‌రోడ్డు పనులు నా హయాంలో 50శాతం పూర్తి అయ్యాయి. దీనిని పూర్తి చేయాలి. ఆత్మకూరు ఆసుపత్రి జిల్లా ఆసుపత్రిలో పడకల సంఖ్య 250కి పెంచాలి. ఆత్మకూరుకు తాగునీటి శాశ్వత పరిష్కారం కల్పించాలి. ఇప్పుడు నీరు అందిస్తున్నాము. కానీ అవి చాలడం లేదు. కెపాసిటీ పెంచాలి. సోమశిల హైలెవల్ కెనాల్ పనుల్లో వేగం పెంచాలి. ఆత్మకూరు టు అనంతసాగరం రహదారిని నేషనల్ హైవేగా మార్చు చేసి విస్తరించాలి. ఆత్మకూరులో ఇంజనీరింగ్ కాలేజీ లేదా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఈ రెండింటిలో ఏది ఎక్కువ ఉపయోగమో దానిని ఏర్పాటు చేయాలి. ఆత్మకూరు ఎంఎస్‌ఎంఈ పార్కులో మధ్య, చిన్న తరహా పరిశ్రమలు తీసుకొని రావాలి.



- ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే

గిరిజనుల అభివృద్ధే లక్ష్యం

సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న గిరిజనుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తా. ఇప్పటికే వారికి ఆధార్, రేషన్ కార్డులు అందించాను. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా గిరిజనులకు అందేలా కృషి చేస్తా. నా నియోజకవర్గంలోని అన్ని ఆసుపత్రులలో సీఎస్‌ఆర్ ఫండ్స్‌తో అభివృద్ధి పనులు చేస్తున్నాం. దానిని కొనసాగిస్తా. బండేపల్లి-డేగపూడి కాలువను పూర్తి చేసేందుకు ప్రయత్నం చేస్తాను. అసంపూర్తిగా ఆగిపోయి ఉన్న దక్షిణ కాలువ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటా. తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుటేరుపై బ్రిడ్జి నిర్మాణం మొదలుపెడతాం. సర్వేపల్లి రిజర్వాయర్‌ను ఆధునికీకరించి వ్యవసాయం, పరిశ్రమలకు మరింత సహకారం అందిస్తాం. కృష్ణపట్నం నోడ్‌లో మరిన్ని పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తాం. పల్లెల్లో సిమెంటు రోడ్లు వేసేలా ప్రణాళికలు రూపొందిస్తాం. పొదలకూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయిస్తా. కోడూరు బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా. రెవెన్యూ సమస్యలను ఆన్‌లైన్ చేయడంతోపాటు నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా.



- సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

రాబోయే ఏడాదిలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉపాధి చూపేందుకు చర్యలు తీసుకుంటున్నా. ఇప్పటికే రెండు జాబ్‌మేళాలు నిర్వహించాము. కిసాన్ సెజ్‌లో ఫ్యాక్టరీల ఏర్పాటుకు ప్రయత్నిస్తా. వీపీఆర్ ఫౌండేషన్ సహకారంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాను. నాబార్డు నిధులతో కనిగిరి రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తాను. పెన్నా డెల్టాలో కాలువలకు మరమ్మతులు చేసి రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తా. ముదివర్తి కాజ్‌వే నిర్మాణానికి శక్తివంచనలేకుండా కృషి చేస్తాను. తీరప్రాంత గ్రామాల్లోని మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. కేంద్ర ప్రభుత్వ నిధులతో బుచ్చిరెడ్డిపాళెం- ఊటుకూరు రోడ్డును ఆధునీకరించేందుకు అనుమతి పొందాము. రాబోయే ఏడాదిలో కార్యరూపం దాల్చేందుకు కృషి చేస్తాను. పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని భావిస్తున్నాను. కోవూరు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేస్తా.



- వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే

పొట్టేపాలెం వద్ద బ్రిడ్జికి కృషి

రూరల్ నియోజకవర్గంలో ముఖ్యమైన పొట్టేపాలెం కలుజు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తాను. కనుపూరు కాలువ డీప్‌కట్ సాధించేందుకు ప్రయత్నిస్తాను. రైతాంగానికి ఇబ్బందులు లేకుండా కాలువలన్నిటినీ బాగు చేయిస్తా. నరసింహకొండ క్షేత్రాన్ని ప్రసాదం పథకం ద్వారా విడుదలయ్యే నిధులతో ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటా. బారాషాహీద్ దర్గాను అభివృద్ధి చేస్తా. క్రిష్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి లక్ష్యంగా పెట్టుకున్నా. రూరల్ నియోజకవర్గంలో గుంతలు లేని రోడ్లు రూపుదిద్దుకోవడమే ప్రాధాన్యతగా పనిచేస్తా. అక్కచెరువుపాడులోని మైనార్టీ గురుకుల పాఠశాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటా. పొదలకూరు రోడ్డు మధ్యలో డివైడర్ పూర్తి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తాం. తూర్పు వైపు రోడ్డును కూడా బాగు చేయిస్తా. జాతీయ రహదారిపై త్వరగా వంతెనల నిర్మాణం పూర్తయ్యేలా చొరవ తీసుకుంటా.



- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే

పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన

కందుకూరులో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పనే లక్ష్యంగా నా ప్రయత్నాలు ఉంటాయి. బీపీసీఎల్, పెట్రో కెమికల్స్, చమురు శుద్ధి కర్మాగారం రామాయపట్నం పోర్టు పరిసరాల్లో ఏర్పాటు కానుంది. ఇండోసోల్, సోలార్ కంపెనీలకు అనుబంధంగా చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్ కూడా ఏర్పాటు చేయించేందుకు ఎంపీ వేమిరెడ్డి సహకారాన్ని కోరతా. వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా. మోపాడు ప్రత్యేక సప్లయ్ ఛానల్‌ను పూర్తి చేయించడంతోపాటు రాళ్లపాడు రిజర్వాయర్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. కందుకూరు పట్టణాన్ని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దడం లక్ష్యంగా పలు అభివృద్ధి పనులకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశాను. పట్టణంలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఉత్తర బైపాస్ రోడ్డు నిర్మాణం అవస్యమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించగా నిధుల మంజూరుకు ఆయన హామీ ఇచ్చారు.



- ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరు ఎమ్మెల్యే

సాగు, తాగునీటి కష్టాలు తీరుస్తా


మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో సాగు, తాగు నీటి కష్టాలు తీర్చడంతోపాటు ఉదయగిరి దుర్గం, ఆనకట్ట, నర్రవాడ, ఘటికసిద్ధేశ్వరం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తా. పరిశ్రమలు నెలకొల్పి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే నా లక్ష్యం. వెలుగొండలో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్, సోమశిల ఉత్తర, హైలెవల్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తా. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం, జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాము. నియోజకవర్గంలో ఫుడ్‌ప్రాసెసింగ్, ఫార్మా, ఆగ్రో, రిలయన్స్, ఎనర్జీ సెక్టార్లను ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి వలసలు నివారిస్తా. ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాము. మంజూరు కాగానే వైద్యశాల అభివృద్ధి చేస్తా. ఉదయగిరి దుర్గంపైకి రహదారి ఏర్పాటు, ఆనకట్ట సుందరీకరణ అనంతరం శ్రీకృష్ణదేవరాయులు, ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేసి కృష్ణమందిరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.



- కాకర్ల సురేష్, ఎమ్మెల్యే, ఉదయగిరి

500 కి.మీ కొత్త రోడ్ల నిర్మాణమే లక్ష్యం

కావలి నియోజకవర్గంలో 500 కి.మీ పొడవున కొత్త రోడ్లను గుర్తించి తొలివిడతలో మట్టి రోడ్లుగా మార్చడమే నా లక్ష్యం. గ్రామాల మధ్య దూరం తగ్గేలా ఈ కొత్త రోడ్ల రూపకల్పన ఉంటుంది. అలాగే కావలిని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి 8వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నా. అలాగే కొండేపి డ్రైను, పిల్లికాలువ, చిప్పలేరు, పైడేరు, అల్లూరు కాలువలను అభివృద్ధి చేస్తాము. బోగోలు, కావలి, జలదంకి మండలాలను సోమశిల పరిధిలో డెల్టా ప్రాంతాలుగా గుర్తించేలా కృషి చేసా. గతంలో నెల్లూరులో డెల్టా ప్రాంతంగా ఉన్న ఆయకట్టు ఇళ్ల నిర్మాణాలకు వెళ్లాయి. వాటి స్థానంలో డెల్టా ప్రాంతాలుగా ఈ మండలాలను గుర్తించనున్నాము. నియోజకవర్గంలోని రైల్వే క్రాసింగ్ గేట్ల స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జీలు, అండర్‌పాస్ బ్రిడ్జీల నిర్మాణానికి కృషి చేస్తా. కావలి-ఉదయగిరి హైవేను కావలి హైవేలో కలిపేందుకు ముసునేరు పైభాగంగా బైపాస్ రోడ్డును తీసుకొచ్చి పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తాము.



- దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే

హద్దు... మీరద్దు!

'ఆంగ్ల సంవత్సరాది' వేడుకలకు అనుమతుల్లేవ్!

నేటి రాత్రి రోడ్లపైనే పోలీస్ యంత్రాంగం

నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు

నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం పలికేందుకు జిల్లా ప్రజానీకం సన్నద్ధమవుతోంది. ముఖ్యంగా యువత వినూత్న రీతిలో ఆహ్వానం పలికేందుకు సిద్ధమవుతోంది. సరిగ్గా అర్థరాత్రి 12 గంటల సమయంలో బాణాసంచా, ప్రధాన కూడళ్లలో కేక్‌ల కటింగ్, రహదారులపై ద్విచక్రవాహనాల్లో తిరుగుతూ కేరింతలు కొట్టడం వంటి చర్యలు ప్రతిసంవత్సరం జరుగుతుంటాయి. అయితే, జిల్లా పోలీసులు మాత్రం వేడుకలకు ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలు పాటించక పోతే చర్యలు తప్పవని గట్టిగానే హెచ్చరిస్తున్నారు.

● మంగళవారం రాత్రి పోలీసు యంత్రాంగం మొత్తం రోడ్లపై తిరుగుతూ ప్రజల రక్షణ, భద్రతపై దృష్టి సారిస్తూ పర్యవేక్షిస్తుంది. ● వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఇళ్ల వద్ద, దేవాలయాల్లో కుటుంబసభ్యుల మధ్య జరుపుకోవాలి. ● అర్ధరాత్రి పూట ఆసుపత్రులు, హాస్టళ్ల, నివాస ప్రాంతాల వద్ద బాణసంచా కాల్చి ఇతరుల ప్రశాంతతకు భంగం కలిగించకూడదు. ● ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ కేకలు వేయడం, అధిక శబ్దాలతో హోరెత్తించడం వంటి చర్యలకూ పాల్పడకూడదు. అంతేగాక రోడ్లపై కేక్‌లు కట్ చాయకూడదని సూచించారు. ● వ్యాపార సంస్థలు, ఇతర షాపులు వారు నిర్ణీత సమయానికి దుకాణాలు మూసేయాలి. ● హాస్టల్స్, ఫంక్షన్ హాల్స్, ఇతర సంస్థలలో నూతన సంవత్సర వేడుకలకు ప్రత్యేక అనుమతులు లేవు. ● వైన్‌షాప్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వం నిర్దేశించిన సమయానికే మూసి వేయాలి. ● బార్లు, హోటళ్లలో అసాంఘిక, అసభ్యకర కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటారు. ● వేడుకల పేరుతో మహిళలను, యువతులను ఈవ్ టీజింగ్ చేయడం, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అనుమానకరంగా, అసభ్యంగా ప్రవర్తించే వారిని అదుపులోకి తీసుకోనున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోండి!

జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఈ వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఇళ్ల వద్దనే జరుపుకోవాలి. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకుంటూ జిల్లా పోలీసులకు సహకరించాలి.

- జి కృష్ణకాంత్, ఎస్పీ

ఫిట్ టెస్ట్

- కానిస్టేబుల్ నియామక దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం



పరుగు పరీక్షలో అభ్యర్థులు

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థులకు దేహదారుఢ్య (ఫిట్‌నెస్) పరీక్షలను అధికారులు సోమవారం ప్రారంభించారు. నెల్లూరులోని పరేడ్ గ్రౌండ్‌లో తెల్లవారుజామున 4 గంటల నుంచే ఈ 'టెస్ట్' మొదలుపెట్టారు. జనవరి 9వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు తొలిరోజు 298 మంది హాజరయ్యారు. ఎత్తు, ఛాతీ కొలతల అనంతరం పరుగు, లాంగ్‌జంప్ వంటి ఈవెంట్స్ నిర్వహించి అర్హత పొందిన వారికి ఉత్తీర్ణత పత్రాలు జారీ చేశారు. జనవరి 3, 4 తేదీల్లో మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు.

- 4వ పేజీలో

ఈ ఏడాది నేరాలు తగ్గాయ్!

- మెరుగైన పోలీసింగ్, సమర్థవంతమైన పనితీరే కారణం
- లోక్ అదాలత్‌లో జిల్లాకు ప్రథమ స్థానం
- వార్షిక నేర నివేదికను విడుదల చేసిన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖలో సమర్థవంతమైన పనితీరు, మెరుగైన పోలీసింగ్‌తో 2024లో నేరాలు తగ్గాయని ఎస్పీ జి కృష్ణకాంత్ తెలిపారు. ఈ సంవత్సర పోలీస్ వార్షిక నేర నివేదికను సోమవారం ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ మాట్లాడుతూ 2023 సంవత్సరంతో పోలిస్తే 2024లో డెకాయిటీ కేసులు 71 శాతం, హత్యాయత్నం కేసులు 66శాతం, చీటింగ్ కేసులు 30.5శాతం, లైంగికదాడి కేసులు 25 శాతం, రోడ్డు ప్రమాదాలు 25 శాతం, దోపిడీ కేసులు 23 శాతం, ఎస్సీ, ఎస్టీ కేసులు 10.5 శాతం తగ్గాయని చెప్పుకొచ్చారు. ఈ సంవత్సరంలో 4 విడతల్లో జరిగిన లోక్ అదాలత్‌లో 34,065 కేసులను పరిష్కరించి రాష్ట్రంలోనే జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. చట్ట వ్యతిరేక, అసంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపామని, పలు సంచలనాత్మక కేసులు ఛేదించామని తెలిపారు. ప్రత్యేక బృందాల ద్వారా ఆధునిక సాంకేతికత ఆధారంగా మిస్సింగ్ కేసులను ఛేదించినట్లు పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా సామాన్య ప్రజలకు చేరువై దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరిచినట్లు చెప్పారు. మొబైల్ మిస్సింగ్ ఫిర్యాదులను వెంటనే స్వీకరించి ఏడు విడతల్లో రూ.8 కోట్ల విలువ గల 3వేల సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. 34,780 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.1,80,43,100 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. అలాగే 6,334 డ్రంక్ అండ్ డ్రైవ్, 8652 బహిరంగ ప్రాంతాల్లో మద్యసేవ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. కాగా,జిల్లాలో వరకట్న మరణాల కేసులు ఈ సంవత్సరంలో నమోదు కాలేదన్నారు.




వార్షిక నేర నివేదిక వివరాలు తెలుపుతున్న ఎస్పీ కృష్ణకాంత్

● పోలీస్ సంక్షేమానికి కృషి

పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లాలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబసభ్యుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. నేర నియంత్రణకు ప్రతి గ్రామంలో, అన్ని కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. 2025లో సరికొత్త పోలీసింగ్‌తో జిల్లా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ డి శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.





పోలీస్ పరీక్షలు

నెల్లూరు(క్రైం),డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ప్రారంభమయ్యాయి. వేకువజామున 4 గంటల నుంచే ఈ పరీక్షలు మొదలుపెట్టారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఆధునిక సాంకేతిక పరికరాలను ఉపయోగించి ఎత్తు,ఛాతీ కొలతలు తీసుకున్నారు. అనంతరం 1600 మీటర్ల పరుగు పోటీ నిర్వహించారు. అందులో అర్హత పొందిన వారికి 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు జరిపారు. వీటన్నింటిలో విజయం సాధించిన వారికి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పరీక్షలకు తొలిరోజు 600 మంది అభ్యర్థులు హాజరుకావలసి ఉండగా 298 మంది హాజరయ్యారు, 302 మంది గైర్హాజరయ్యారు. దేహదారుఢ్య పరీక్షల తీరును ఎస్పీ జీ కృష్ణకాంత్ పర్యవేక్షించారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిఫార్సులతో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా జనవరి 3, 4 తేదీలలో మహిళా సిబ్బందితో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. 9వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని ఎస్పీ తెలిపారు.



గుర్తుకొస్తున్నాయి!

● కనుమరుగైన గ్రీటింగ్ కార్డులు ● ఇప్పుడంతా ఫోన్లోనే! ● ఈ-గ్రీటింగ్‌లపై అందరిచూపు

ఒకప్పుడు పుట్టిన రోజు, పెళ్లి రోజు, ప్రేమికుల రోజు ఇలా ఏ సందర్భానికైనా తప్పనిసరిగా గ్రీటింగ్‌కార్డు ద్వారా శుభాకాంక్షలు తెలిపేవారు. ముఖ్యంగా ఆంగ్ల సంవత్సరాది వస్తోందంటే చాలు పల్లెలు మొదలు పట్టణాల వరకు ప్రతి దుకాణం ముందు వందలాది గ్రీటింగ్‌కార్డులు ప్రత్యక్షమయ్యేవి. ప్రతి డిసెంబరు నెలలో జిల్లావ్యాప్తంగా లక్షలాది రూపాయల వ్యాపారం జరిగేది. ఇప్పుడా పరిస్థితి లేదు. గ్రీటింగ్ కార్డు గత కాలపు తీపిజ్ఞాపకంగా మారిపోయింది.

- ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి)

"కత్తి వచ్చే కర్ర పోయే ఢాం... ఢాం...ఢాం..." అని పల్లెల్లో చిన్నతనంలో పాడుకునేవారు. కొత్త నీరు రాగానే పాత నీరు కొట్టుకుపోతుందనేది పెద్దల సామెత. నేడు గ్రీటింగ్‌కార్డుల పరిస్థితికి ఈ రెండు సామెతలు సరిగ్గా సరిపోతాయి. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో గ్రీటింగ్‌కార్డు చిన్నబోయింది. ఆత్మీయులకు, బంధువులకు, స్నేహితులకు శుభాకాంక్షలు తెలియజేయడానికి గ్రీటింగ్ కార్డు ద్వారా తమ ఆత్మీయతను తెలియజేయడం మానుకున్నారు. ఒక గ్రీటింగ్‌కార్డు కొని దాన్ని పోస్టు ద్వారా బంధువులకు, స్నేహితులకు పంపించాలంటే కనీసం రూ.20 నుంచి రూ.100 వరకు ఖర్చవుతుంది. అంతేగాక జనవరి 1 నూతన సంవత్సరం రోజుకు వాళ్ళకు అందాలంటే కనీసం నాలుగైదు రోజుల ముందు మనం గ్రీటింగ్‌కార్డు పంపాల్సి వచ్చేది. నవంబరు చివరి వారంలోపే వ్యాపారులు రకరకాల గ్రీటింగ్‌కార్డులను అమ్మకానికి పెట్టేవారు. డిసెంబరులో వేలాదిగా వెళ్ళే గ్రీటింగ్‌కార్డుల ద్వారా తపాలాశాఖకూ ఆదాయం గణనీయంగా పెరిగేది. అంతేగాక ప్రతి ఊరిలోనూ పోస్టుమన్ సైతం గ్రీటింగ్‌కార్డుల బట్వాడాతో ఎంతో హడావుడిగా కనిపించేవారు. అయితే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి పూర్తిగా కనుమరుగైంది. ఒక వెలుగు వెలిగిన గ్రీటింగ్‌కార్డుల ప్రభావం నేడు దాదాపు కనుమరుగైపోయింది.

క్షణాల్లో విషెస్..

123 గ్రీటింగ్స్, అమెరికన్ గ్రీటింగ్స్, పేపర్‌లెస్‌పోస్ట్, ఆల్ మార్క్ ఈకార్డ్స్, మొదలైన ఎన్నో వెబ్‌సైట్ల ద్వారా అందమైన గ్రీటింగ్‌కార్డులను చిటికెలో మన ఆత్మీయులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా పంపించవచ్చు. ఇక జీకార్డ్, జింక్‌గ్యాలరీ, వామ్‌లీగ్రీటింగ్‌కార్డ్స్, రెడ్‌స్టాంప్‌కార్డ్స్ మొదలైన ఎన్నో యాప్స్ ద్వారా సైతం అందమైన గ్రీటింగ్‌కార్డులను సృష్టించి వాట్సప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం తదితర సామాజిక మాధ్యమాల ద్వారా అవతలివారికి షేర్ చేయవచ్చు. ఇలా నూతన టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో గ్రీటింగ్‌కార్డులు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో ప్రింటెడ్ మగ్గులు, సెల్‌ఫోన్ పౌచ్‌లపై శుభాకాంక్షల సందేశాన్ని ముద్రించి బహూకరించడం వంటి వాటిపై యువత ఆసక్తి చూపుతోంది. సాధారణ గ్రీటింగ్‌కార్డును అడిగేవారే లేకపోవడంతో కనుమరుగయ్యాయి.

ఆకట్టుకునేలా ఈ-గ్రీటింగ్ కార్డ్సు

ఈ-గ్రీటింగ్‌కార్డ్సుగా పిలవబడే ఎలక్ట్రానిక్ గ్రీటింగ్‌కార్డులను అందించేందుకు ఎన్నో వెబ్‌సైట్లు, యాప్స్ నేడు అందుబాటులోకి వచ్చాయి. వీటిలో మనకు నచ్చిన గ్రీటింగ్ కార్డును ఎంచుకునే సదుపాయం ఉంది. అంతేగాక పర్సనలైజ్ యాప్ ద్వారా ఎంచక్కా గ్రీటింగ్‌కార్డుపై మన ఫొటో, పేరు, అవతలి వారి పేరు, ఫొటో, మనకు నచ్చిన సందేశం కూడా జోడించి శుభాకాంక్షలను క్షణాల్లో అందించవచ్చు. ఇక కొన్ని వెబ్‌సైట్లు, యాప్స్ అయితే మ్యూజిక్ గ్రీటింగ్‌కార్డులను కూడా అందిస్తున్నాయి. కొన్నింటిలో మన గొంతుతోనే శుభాకాంక్షల సందేశాన్ని రికార్డు చేసి పంపించవచ్చు.





● బహుముఖ చిత్రకారుడు సుందర బాబు
● వందలాది బొమ్మలకు జీవం
● ఎన్నో పోటీల్లో ప్రతిభ
● ప్రముఖుల ప్రశంసలు, పురస్కారాలు
● 18న ఎన్టీఆర్ చిత్రాల ప్రదర్శన

సుందర చిత్రాలు



ఆధునిక చిత్రాలు గీయడంలో ఆయన దిట్ట. కుంచె కదిపితే సజీవ దృశ్యాలు కళ్లముందు సాక్షాత్కరిస్తాయి. ప్రకృతి రమణీయ అయినా, మగువల ముగ్ధ మనోహర రూపమైనా, దేవతా స్వరూపాలైనా, అభిమాన నటులైనా, కళాకారులైనా... ఆ కళాకారుడి నైపుణ్యం అబ్బురపరుస్తుంది. ఆయనే మున్నెం సుందర బాబు సామాన్య రైతు కుటుంబంలో పుట్టి తండ్రి స్ఫూర్తితో చిత్రకళలో ప్రావీణ్యం సంపాదించి ఎన్నో పురస్కారాలు, ఎందరి నుంచో ప్రశంసలు అందుకుంటున్నారు.

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సుందర బాబు స్వస్థలం విడవలూరు మండలం ముదివర్తి గ్రామం. తండ్రి కృష్ణమూర్తి మేకప్ ఆర్టిస్టు. పల్లె అందాలను అందంగా చిత్రీకరిస్తున్న సుందరబాబును తండ్రి ప్రోత్సహించి మెలకువలు నేర్పారు. పాఠశాలలో అతనిలోని చిత్రకళాకారుడ్ని గుర్తించిన ఉపాధ్యాయులు వెన్నుతట్టారు. దీంతో 10వ ఏటకే సుందరబాబు చిత్రకారుడిగా గుర్తింపు పొందారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆయన చిత్రకళనే వృత్తిగా మలచుకున్నారు. చిన్నతనం నుంచి చిత్రాల ద్వారా వచ్చిన ఆదాయాన్ని కుటుంబ అవసరాల కోసం వినియోగిస్తున్నారు. కమర్షియల్ ఆర్టిస్టుగా ఎదగాలని యాడ్ ఏజన్సీలలో పని చేశారు. కానీ ఫ్లెక్సీ ప్రింటింగ్ యుగం రావడంతో యాడ్ ఏజెన్సీలు ఫ్లెక్సీలవైపే మొగ్గు చూపడంతో చిత్ర కళాకారులకు ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. అయితే సుందర బాబు వైవిధ్యమైన చిత్రాలు గీయడంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. సుందర్ ఆర్ట్స్ అనే సంస్థను నెలకొల్పి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే చిత్రకళా పరిషత్‌లలో తన చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. హైదరాబాద్‌లోని మాదాపూర్ చిత్రమయి స్టేట్ గ్యాలరీలో చిత్రాలు ప్రదర్శించి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, నాట్యకారిణి శోభానాయుడు నుంచి అవార్డులు అందుకున్నారు. జిల్లా కలెక్టర్ కోరిక మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చిత్రాలుగా మలిచి అందజేశారు. అవి ఏనాటికైనా మ్యూజియంలో ప్రదర్శనకు నోచుకుంటాయని ఆశిస్తున్నారు. 2007లో మైసూరు విశ్వవిద్యా లయం నుంచి దూర విద్య ద్వారా ఫైన్ ఆర్ట్స్ కోర్సు పూర్తి చేసిన సుందరబాబు, విఘ్నేశ్వరుడిని 99 రూపాల్లో చిత్రించి తన కళా నైపుణ్యాన్ని చాటారు. ఆ చిత్రాలను టౌనుహాలులో ప్రదర్శించి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. సుందరబాబు ఇప్పటి వరకు 25కిపైగా జాతీయ అవార్డులు, 20కిపైగా రాష్ట్రస్థాయి అవార్డులు అందుకున్నారు. 150కి పైగా చిత్రకళా పోటీల్లో ప్రతిభ చాటారు. తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు దక్కించుకున్నారు. 2015లో ఒంగోలులో 100 మంది చిత్రకారులతో నిర్వహించిన 100 గంటలు, వంద చిత్రాల పోటీలో పాల్గొని మిరాకిల్ వరల్డ్ రికార్డు సాధించారు. గత అక్టోబరులో కలకత్తాలో చిత్ర కళా ప్రదర్శన నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ముదివర్తి గ్రామంలోని కరి మాణిక్యస్వామి ఆలయాన్ని (విష్ణు ఆలయం) సజీవంగా చిత్రించి, చిత్ర ప్రపంచాన్ని అబ్బురపరిచారు. అలాగే ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి వంటి ప్రముఖుల చిత్రాలను చిత్రించి వారికే బహుమతులుగా అందజేశారు.


సుందర బాబు





18న ఎన్టీఆర్ చిత్ర ప్రదర్శన

సుందరబాబు చిత్రకళ ద్వారా ఎన్టీఆర్ అభిమానులకు కనువిందు చేయబోతున్నారు. ఎన్టీఆర్ శత జయంతి, సినీ రంగంలో అడుగుడి 75 వసంతాల ఉత్సవం సందర్భంగా విశ్వ విఖ్యాత నటసార్వభౌముని 30 చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 18 నుంచి 21వతేదీ వరకు నెల్లూరు పురమందిరం వర్ధమాన సమాజంలో నెల్లూరు కలర్స్ పేరుతో నెల్లూరు చిత్రకారుల కళాప్రదర్శనలో ఈ చిత్రాలు ప్రదర్శించనున్నారు.

108 సిబ్బంది వేతనం రూ.4 వేలు పెంపు


రోగులకు వైద్యసేవలందిస్తున్న 108 సిబ్బంది

ఉదయగిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న 108 వాహన సిబ్బందికి కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. పైలెట్లతోపాటు ఈఎంటీలకు రూ.4 వేలు చొప్పున వేతనం పెంచుతున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేతనాలు పెంచాలని పలుమార్లు సిబ్బంది ఆందోళనలు చేపట్టినా పట్టించుకోలేదు. ఎన్నికల హామీ మేరకు వేత నాలు పెంచుతూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. జీతాల పెంపుతో జిల్లాలో ఉన్న 39 వాహనాల్లోని 96 పైలెట్లు, 88మంది ఈఎంటీలకు లబ్ధి చేకూర నుంది. 108 వాహనంలో పైలెట్లు, ఈవీఎంటీలు 12 గంటలపాటు డ్యూటీలో ఉంటారు. వీరికి జీతంతోపాటు అదనంగా గత టీడీపీ ప్రభుత్వంలో రూ.4 వేలు చెల్లించేశారు. అయితే వైసీపీ అధికా రంలోకి వచ్చాక ఆ చెల్లింపులను రద్దు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గతంలోలా రూ.4 వేలు ఇస్తామని వెల్లడించింది.

వైసీపీ పాలనలో నష్టాల ఊబిలో నుడా

● చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి


అధికారులతో సమీక్షిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు (జడ్పీ), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థను నష్టాల ఊబిలోకి నెట్టారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు. నుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆర్థిక వనరులపై అధికారులతో ఆయన చాంబర్‌లో సోమవారం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నుడాకు ఆర్థిక వనరులు పెంచకుండా ఇష్టప్రకారం పనులు చేపట్టి సంస్థను నష్టాలపాలు చేసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆర్థిక వనరులను సృష్టించుకునే కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందుకోసం ఎంఐజీ లేఔట్లు పెద్దఎత్తున ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. కావలి, కందుకూరులో గత ప్రభుత్వంలో వేసిన లేఔట్లలో కొంతమేర మాత్రమే ప్లాట్ల అమ్మకాలు జరిగాయని, అక్కడ మౌలిక వసతుల కల్పన పూర్తి చేయలేదన్నారు. కందుకూరు లేఔట్లో స్థలాల ధరలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని కోటంరెడ్డి పేర్కొన్నారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో ఎంఐజీ లేఔట్ల ఏర్పాటుతో మధ్య తరగతి ప్రజలకు, ఉద్యోగులకు తక్కువ ధరలకే ఇళ్ల స్థలాలు విక్రయిస్తామని తెలిపారు.

'సోమశిల'లో 71.919 టీఎంసీల నీరు

అనంతసాగరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 4,865 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 71.919 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 1,550, కండలేరుకు 800, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువ 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

స్టాప్‌లాక్ గేటు బయటకు లాగివేత

3 వారాల సందిగ్ధతకు తెర

● మరమ్మతు చేసి మరలా బిగించనున్న అధికారులు ● నేటి నుంచి సర్వీసు గేటు నుంచే కుడి కాలువకు నీరు


రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము స్టాప్‌లాక్ గేటును పూర్తిగా పైకి లాగిన సిబ్బంది

లింగసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము గేటు సమస్యకు సోమవారంతో తెరపడింది. సాయంత్రానికి మెఘా ఇంజనీరింగ్ నిపుణులు, మరో మెకానిక్ నిపుణులు షేక్ షమీంబాషా, ప్రాజెక్టు అధికారులు సిబ్బంది తూము వద్ద నది లోపలి వైపు ఇసుక బస్తాలు వేసి చైన్ పుల్లీలతో గేటును పూర్తిగా పైకి లాగారు. అంతకుముందు గేటు రెండు అడుగులు మాత్రమే వచ్చిన వచ్చిన విషయం తెలిసిందే. దాని తూము నుంచి బయటకు తీయడంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ గేటు దెబ్బతిని మొరాయించడంతో సాగు నీటి కోసం రైతులు ధర్నాలు చేసిన విషయం తెలిసిందే. సమస్యను పరిష్కరించేందుకు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నడుం బిగించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల ఇంజనీరింగ్ నిపుణులను రప్పించి గేటును తొలగింపజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డీఈ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. 20 రోజుల కిందట స్టాప్‌లాక్ గేటు, స్క్రూ రాడ్డుకు మధ్యలో బోల్టు విరిగినందు వలన ఈ సమస్య నెలకొన్నట్లు చెప్పారు. ప్రస్తుతం పైకి లాగిన గేటు.. స్క్రూ రాడ్డుకు కొత్త బోల్టు బిగించి తిరిగి గేటును యథాస్థానంలో దించుతామన్నారు. మంగళవారం నుండి సర్వీసు గేటు ద్వారా కుడి కాలువకు నీరు విడుదల చేస్తామన్నారు.

ముగ్గురమ్మల తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు


పోలేరమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

అల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న ముగ్గురమ్మల తిరునాళ్లకు ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక పేటలోని పోలేరమ్మ ఆలయం, గ్రామంలోని కలుగోళమ్మ, గంగమ్మ ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణతో పాటు విలువైన రకరకాల పూలతో ప్రత్యేక అలంకరణలు చేపడుతున్నారు. పారిశుధ్య సిబ్బందితో గ్రామమంతా పారిశుధ్య పనులు చేయించడం, గుంటలు, మిట్టలు చదును చేస్తున్నారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కాకుండా విద్యుత్ అధికారులు ముందస్తు జాగ్రత్తలను తీసుకుంటున్నారు. ఆర్డీవో వంశీకృష్ణ అల్లూరులో పర్యటించి సలహాలు ఇచ్చారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ తమ సిబ్బందితో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



25 ఏళ్లుగా అసంపూర్తిగానే..

మండల కేంద్రమైన సంగం రాళ్లచెలిక ఎస్టీకాలనీలో గిరిజనుల సామాజిక అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ భవనం 25 ఏళ్లుగా అసంపూర్తిగానే ఉంది. 2000 సంవత్సరంలో పనులు ప్రారంభించి నిధులు చాలకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు. ఆ తరువాత దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గోడలు దెబ్బతిని శిథిల స్థితికి చేరి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కమ్యూనిటీ భవనాన్ని పూర్తిచేయడమో లేక ప్రమాదం జరగకముందే తొలగించడమో చేయాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

వైష్ణవాలయాల్లో నేటి నుంచి అధ్యయనోత్సవాలు

● 10న వైకుంఠ ఏకాదశి



విద్యుద్దీపాల వెలుగులో వేణుగోపాలస్వామి ఆలయం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వైష్ణవ ఆలయాల్లో మంగళవారం నుంచి అధ్యయనోత్సవాలు ప్రారంభం కానున్నాయి. జనవరి 9 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు, 10వ తేదీ వైకుంఠ ఏకాదశి (ఉత్తర ద్వార దర్శనం), 10 నుంచి 19వ తేదీ వరకు రాపత్తు ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. అధ్యయనోత్సవాల్లో ఉదయం ఆళ్వార్ల ఘోష్టి, స్వామివారి సమక్షంలో నాలయిర దివ్యప్రబంధ ఘోష్టి గానాలు, రాత్రి విశేష అలంకారాల్లో స్వామివారి ఉత్సవాలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి పెంచలకోన పెనుశిల పెంచల నరసింహస్వామి, కొండబిట్రగుంట క్షేత్రాలతోపాటు నెల్లూరు నగరంలోని రంగనాయకులపేట తల్పగిరి రంగనాథస్వామి, మూలాపేట వేణుగోపాలస్వామి, అయ్యప్పగుడి గురువాయురప్పన్ మహావిష్ణు, మాగుంట లేఅవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాలతోపాటు అన్ని వైష్ణవ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాగా మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం పగల్‌పత్తు ఉత్సవంలో వేణుగోపాలస్వామి స్వర్ణ వైరముడి సేవలో దర్శనం ఇస్తారని ఆలయ చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, సహాయ కమిషనర్ జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తేదీ కాళింగ మర్దనం, 2న వైకుంఠనాథన్, 3న శ్రీరామ పట్టాభిషేకం అలంకారాలు జరుగుతాయని తెలిపారు. 4న త్రివిక్రమ అలంకారం, 5న వేణుగోపాల స్వామి అలంకారం, 6న శ్రీమత్‌భగవద్గీత, 7న వటపత్రసాయి అలంకారం, 8న యోగనరసింహ స్వామి అలంకారం, 9న మోహినీ అలంకారంలో స్వామివారు దర్శనమిస్తారని పేర్కొన్నారు.



రంగడి ఆలయ శోభ

బీఎల్వోలకు తీపి కబురు!

● ఎన్నికల విధుల రుసుము విడుదల

● ఒక్కొక్కరికి రూ.12,750 వంతున లబ్ధి



బీఎల్వో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి (ఫైల్)

మనుబోలు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొత్త సంవత్సరం సందర్భంగా కూటమి ప్రభుత్వం బీఎల్వోలకు తీపికబురు అందించింది. రెండేళ్ళుగా పేరుకుపోయిన బకాయిలును ఏకమొత్తంగా (డిసెంబరు వరకు) విడుదల చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 2,329మంది బీఎల్వోలు (బూత్ లెవల్ అధికారులు) లబ్ధి పొందనున్నారు. దీంతో ఒక్కో బీఎల్వోకు రూ.12,750 ఒకే సారి అందనున్నాయి. ఓటర్ల జాబితా తయారీ నుంచి స్లిప్పుల పంపిణీ వరకు ఎన్నికల నిర్వహణ, పోలింగ్ సమయంలో కీలకమైన విధులు నిర్వర్తిస్తున్న బీఎల్వోలకు గత ప్రభుత్వం రెండేళ్లకు పైబడి గౌరవభృతి చెల్లించకుండా తాత్సారం చేసింది. అయినా గత సార్వత్రిక ఎన్నికల వరకు వీరు ఆర్థిక ప్రయోజనాలను పట్టించుకోకుండా బాధ్యతాయుతమైన విధులు నిర్వర్తించడంలో తలమునకలుగా పనిచేశారు. ఎన్నికలు పూర్తయిన తరువాత ఇప్పుడు మళ్లీ ఓటర్ల జాబితాల సవరణ బాధ్యతల్లో కొనసాగుతున్నారు.

● **మూడేళ్లది ఒకేసారి..**

నాలుగేళ్ళ క్రితం వరకు బీఎల్వోలుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, కార్యదర్శులు, వీఆర్‌వోలు అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఇందుకుగాను నెలకు రూ.250 చెల్లించేవారు. అదీ ఏడాదికో, రెండేళ్ళకో నిధులు విడుదలయ్యేవి. 2022, జనవరి నుంచి ఈ గౌరవభృతిని నెలకు రూ.500 ఎన్నికల కమిషన్ పెంచింది. పేరుకు పెంచారే గాని 2021, అక్టోబరు నుంచి పాత, కొత్త గౌరవభృతి చెల్లించనేలేదు. సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీలకు బదులు సచివాలయ ఉద్యోగులను బీఎల్వోలుగా నియమించారు. ఏళ్ళ తరబడి గౌరవభృతి అప్పటి ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తాము వెట్టిచాకిరీ చేస్తున్నామనే నైరాశ్యంతోనే బీఎల్వోలు పనిచేస్తూ వస్తున్నారు. అనూహ్యరీతిలో 2021, అక్టోబరు నుంచి 2024 డిసెంబరు వరకు ఉన్న బకాయిలను విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పెన్నానదిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కోవూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మిపాళెం సమీపంలోని పెన్నానదిలో సోమవారం పశువుల కాపరులు ఓ మహిళ మృతదేహాన్ని కనుగొని పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్ మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆకుపచ్చ చీర ధరించిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించలేకపోయారు. వీఆర్వో హరికృష్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎంప్లాయీస్ హెల్త్ స్కీం ఇబ్బందులు తొలగించాలి

ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్‌కు వినతి



కో ఆర్డినేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న సుధాకర్‌రావు, నాయకులు

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎంప్లాయీస్ హెల్త్ స్కీం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్‌ను హంస అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఉన్న ఎన్టీఆర్ వైద్య సేవ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) నేతలు జిల్లా కో ఆర్డినేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీం ద్వారా ఏఏ ఆసుపత్రుల్లో సేవలు అందిస్తారో ఆయా ఆసుపత్రుల యాజమాన్యాలతో మాట్లాడి ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ దివ్వెల ప్రసాద్, ఆర్థో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా మేనేజర్ వెంకట మురళి, టీ లీడర్స్ దశరథరామిరెడ్డి, మధు, కోటేశ్వరరావు, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	112
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	206
స్కిన్‌లెస్	226
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7344
వెండి కిలో ధర	రూ. 89,600
వెండి ఒక గ్రాము	రూ.92.60

ప్రతి అర్జీని పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌లో జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడుతూ ఈ అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. సోమవారం 227 మంది అర్జీలు సమర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

● **సోషల్ ఆడిట్ తప్పిదాలను సరిచేయాలి:** సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ ఎస్సీ కులగణనకు సంబంధించి సోషల్ ఆడిట్ జాబితాలో ఎస్సీ మాదిగకు సంబంధించి వివరాల నమోదు చేయడంలో జరుగుతున్న తప్పులను సరిచేయాలని కోరుతూ సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ జేసీ కార్తీక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘం నేతలు జనార్దన్‌రావు, పల్లాల శ్రీనివాసులు, కుడు ముల సుబ్బారావు, బాబు, డానియల్, చిన్న య్య తదితరులు పాల్గొన్నారు.

● **బ్రిడ్జి నిర్మించాలి : జనసేన**

ఉదయగిరి నియోజకవర్గం సీతారాంపురంలో 150 సంవత్సరాలుగా ముస్లింలు, బోయలు శ్మశాన వాటికకు మోకాళ్ల లోతు నీళ్లలో నడిచి పోవాల్సి వస్తుందని, ఆ మార్గంలో బ్రిడ్జీ నిర్మించాలని కోరుతూ జనసేన నాయకులు గునుకుల కిషోర్, నూనె మల్లికార్జునయాదవ్, కారంపూడి కృష్ణారెడ్డి, బోగినేని కాశిరావులు జేసీకి వినతిపత్రం అందచేశారు. అలాగే కొండాపురంలో అప్పనంగా కిందరికి రాచిఇచ్చిన 60 ఎకరాల భూమిని కాపాడాలని కోరారు.

● ఎస్సీ కులగణ సర్వే తేదీని పొడిగించాలని కోరుతూ ఎంఎస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనిస్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయ్‌కృష్ణమాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ జేసీకి వినతిపత్రం సమర్పించారు.

● సిమెంటు రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని కోరుతూ నెల్లూరు రూరల్ కొండ్లపూడి పంచాయతీ వాసులు జేసీకి వినతిపత్రం సమర్పించారు.

నేడే పింఛన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెలా ఒకటో తేదీన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం మరింత దూకుడుగా ఉంది. ఒకటోతేదీ సెలవు దినమైతే ఆ తరువాత రోజు కాకుండా ముందు రోజే పింఛను పంపిణీ చేస్తోంది. రాబోయేది నూతన ఆంగ్ల సంవత్సరాది కావడంతో ఒక రోజు ముందే మంగళవారమే పింఛన్ల పంపిణీకి ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 3,10,029 మంది పింఛనుదారులు ఉన్నారు. వారికి రూ.131.63 కోట్లను పింఛనుగా అందిస్తున్నారు. కాగా, మంగళవారం ఉదయం 7.30 గంటలకు నెల్లూరులోని గుర్రాలమడుగు సంఘంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

'కుష్ఠు' నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయండి

● అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణకు పీహెచ్‌సీలు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి ఆదేశించారు. సోమవారం జిల్లా కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాది జనవరి 20 నుంచి కుష్ఠువ్యాధి సర్వే చేపట్టాలని తెలిపారు. అలాగే పీహెచ్‌సీల పరిధిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అంగవైకల్యం ఉన్న కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్య చికిత్సలకు డీఫైబటీ సంస్థకు పంపాలని తెలిపారు. కొత్త కేసులను గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర బాబు, ఫిజియోథెరపిస్ట్ నరసింహులు, మల్లమ్మ, ప్రసాదాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

● సవాళ్లను సమర్థంగా అధిగమించాలి

● వార్షిక నేర సమీక్షలో ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాబోయే సంవత్సరంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించి జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సాయంత్రం వార్షిక నేర సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పోక్సో చట్టం కేసులను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నా మని చెప్పారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండుగలు, పర్వదినాల్లో జూదం, కోడి పందాలు, అశ్లీల నృత్యాలకు అనుమతి లేదని, ఎవరైనా అలాంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు విరివిగా నిర్వహించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేయాలని సూచించారు. జైలు నుంచి విడుదలయ్యే వారిపై, రౌడీషీటర్లపైనా ప్రత్యేక నిఘా ఉంచాలని, వారు మళ్లీ నేరాలకు పాల్పడుతుంటే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ సమష్టిగా పని చేయడం వలనే జిల్లాలో గణనీయంగా నేరాలు తగ్గాయంటూ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు పాల్గొన్నారు.



వార్షిక సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్, పక్కన అదనపు ఎస్పీ సౌజన్య

పోలీసు పీజీఆర్ఎస్‌కు 52 ఫిర్యాదులు

ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 52 మంది ఫిర్యాదుదారులు తరలివచ్చి వారి సమస్యలు పోలీసు అధికారులకు విన్నవించుకున్నారు. డీటీసీ డీఎస్పీ గిరిధర్‌రావు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ జి.కృష్ణకాంత్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాల లారీ స్వాధీనం

ఉదయగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి కావలికి చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న మినీ లారీని సోమవారం ఉదయగిరి సీఐ ఎస్ వెంకటరావు తన సిబ్బందితో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. దుత్తలూరు మండలం నందిపాడు సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై సీఐ వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో బెంగళూరు నుంచి కావలికి చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న మినీ లారీ వారిని గమనించి ఉదయగిరి వైపు దారి మళ్లించారు. దాంతో సీఐ లారీని వెంబండించి ఉదయగిరి ఆనకట్ట సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి స్వాధీనం చేసుకున్న లారీలోని 80 డ్రమ్ముల్లోని సుమారు 10 టన్నుల చికెన్ వ్యర్థాలను ఉదయగిరి పట్టణ సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద గుంత తీసి అందులో వేసి పూడ్చివేయించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న చికెన్ వ్యర్థాల లారీ





సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

కావలి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు సోమవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య మాట్లాడారు. ఫిబ్రవరి 1,2,3తేదీల్లో నెల్లూరు జరుగనున్న మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర పార్టీ ప్రముఖులు హాజరుకానున్నారని, ప్రజా సమస్యలపై ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటాల కార్యచరణ ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణమోహన్, కృష్ణయ్య, మధుసూధన్‌రావు, అమీర్‌బాష, బాబురావు, తిరుపాల్ పాల్గొన్నారు.

దాతల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం

ఉదయగిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాతల సహకారంతో అల్పాహారం అందించనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు షేక్ నాయబ్ సోమవారం తెలిపారు. మాట్లాడుతూ కొత్తపల్లికి చెందిన పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మూలె నేహారెడ్డి తండ్రి నాగసుబ్బారెడ్డి ప్రతిరోజు అల్పాహారం అందజేసేందుకు ముందుకొచ్చారన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ

అనంతసాగరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మవరంలోని ముత్యాలమ్మ ఆలయంలో హుండీ చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు. సోమవారం ఉదయం హుండీని తస్కరించినట్లు ఆలయ పూజారి గుర్తించారు. అందులో 8 నెలల నుంచి భక్తులు వేసిన కానుకలు ఉన్నాయని, ఈవిషయంపై అనంతసాగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాల నృత్యకారులకు అభినందనలు


చిన్నరులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాల నృత్యకారులను సోమవారం ముసునూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి అభినందించారు. కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో 29న హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2వేల మంది కూచిపూడి కళాకారులతో నిర్వహించిన మహా బృంద నాట్యంలో సంయుక్త నృత్య కళా నిలయంకు చెందిన చిన్నారులు పాల్గొని ప్రతిభ చూపడం హర్షనీయం అన్నారు. ఈ సందర్భంగా నాట్యగురువు లిఖిత, చిన్నారులు మోక్షశ్రీ, హసీన, సాయినిహారిక, యశ్రశ్రీవిద్య, అర్షియ, లక్ష్మీపల్లవి, రిషిత, రక్షిత, కృష్ణప్రియ, మనస్వి, ఇందుప్రియ, రిత్వికలను సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలు అందజేశారు. ప్రాచీన కళలు అంతరించిపోకుండా చిన్నారులకు శిక్షణ ఇస్తున్న నాట్యగురువు లిఖితను అభినందించారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు ఎంతో మేలు

కొండాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తలకు మేలు జరుగుతుందని టీడీపీ కన్వీనర్ ఎం.ఓంకారం, నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్ణయ్య తెలిపారు. గరిమెనపెంట పంచాయతీ ఎస్సీ కాలనీలో సోమవారం జరిగిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలు ప్రవేశపెట్టారని చెప్పారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మండలంలో 13వేలకుపైగా సభ్యత్వాలు చేపట్టామన్నారు. నమోదుకు ఒక్కరోజు గడువు ఉందని, ఇప్పటివరకు నమోదుకాని కార్యకర్తలను గుర్తించి ఆయా గ్రామాల నాయకులు వెంటనే సభ్యత్వాలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతు అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీనివాసులు, మండల మాజీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మాచర్ల తదితరులు పాల్గొన్నారు.

రాళ్లపాడు ప్రాజెక్టు పాపం వైసీపీదే : మాజీ ఎమ్మెల్యే దివి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టు ఆయ కట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు వచ్చేందుకు ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వదే అని ఐదేళ్ల కాలంలో ఏ ఒక్కరోజు గేట్లుకు గ్రీసు పూసిన పాపాన పోలేదని కందుకూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివి శివరాం విమర్శించారు. సోమవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రాజెక్టు నిర్వాహణకు 20 శాతం నిధులు కేటాయించేలా ఎమ్మెల్యే ఇంటూరి చొరవ తీసుకోవాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల ముమ్మర గాలింపు

బిట్రగుంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకుని నాటుసారా తయారు చేసే స్థావరాలను గుర్తించేందుకు సోమవారం జిల్లా ఎక్సైజ్ ఏఈ జే.రమేష్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కప్పరాళ్ళతిప్ప, బోగోలు, గంగతిప్ప, చెంచులక్ష్మీపురం, నాగులవరం, సోమేశ్వరపురం గ్రామాల పరిధిలోని అటవీప్రాంతాల్లో తిరిగారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన యిరిగినేని రవీంద్రబాబు తండ్రి తిరుపతి నాయుడు, [illegible], నెల్లూరుసిటీ. ప్రస్తుత నివాసం: No.B-15, Myans Luxury East Coast Road, Villas 34, VTC: Kannathur Reddy Kuppam, PO: Mullukadu, District: Kancheepuram, State: Tamilnadu, PIN Code: 603112. [illegible] నా క్లయింట్ పడుగుపాడు పంచాయితీలో చేరిన పడుగుపాడు గ్రామ పొలంలోని నెం.88రు పట్టా దాఖలా సర్వే నెం.131-1 లు య 1-49ల్లులో య 1-00లు భూమిని పద్మవ పెద వెంగయ్య గారి భార్య లక్ష్మమ్మ గారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 10-09-1986 డాక్యుమెంటు నెం.765/1986 (SRO, Kovur) ద్వారా [illegible] పడుగుపాడు పంచాయితీలో చేరిన పడుగుపాడు గ్రామంలోని సర్వే నెం.131/1 లు. య 0-49 1/2 సెంట్లు భూమిని శ్రీవగుంట ఖాజాబీ భర్త ఖాజాసాహెబ్ గారి వద్ద నుండి రిజిష్టర్డు విక్రయపత్రం తేది: 10-12-1990 డాక్యుమెంటు నెం.956/1990 (SRO, Kovur) ద్వారా [illegible] తేది 15-12-2024దిన [illegible] ఒరిజినల్ డాక్యుమెంట్లు నెం.765/1986& 956/ 1990లు [illegible] నా క్లయింటును బద్ధులను చేయవు.

పెనుబాక గంగాధరరెడ్డి, B.Com., B.L., అడ్వకేట్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు-3. సెల్:9640341333

అసంపూర్తిగా ముగిసిన వాహనాల రుసుం వసూళ్ల వేలం

ఉదయగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం అధ్యక్షతన నిర్వహించిన బస్టాండ్‌లో వాహనాల రుసుం వసూళ్ల వేలంపాట అసంపూర్తిగా ముగిసింది. ఎంపీడీవో అప్పాజీ, పంచాయతీ ఈవో కరీముల్లాలు వేలంపాట నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొన్నారు. ఈ వేలంపాటలో యాస్మిన్ రూ.2 లక్షలకు పాట దక్కించుకున్నారు. అయితే ఉప సర్పంచ్ షేక్ ముర్తుజాహుస్సేన్ తాను ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొంటాననడంతో అధికారులు సమయం ముగిసిందని నిరాకరించారు. అలాగే సర్పంచ్ సామ్రాజ్యం కూడా పాట రద్దు చేస్తున్నట్లు తెలిపి అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో అధికారులు విషయాన్ని ఆత్మకూరు డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశాన్ని మంగళవారం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు అధికారులు తెలిపారు.

శిథిలావస్థలో పంచాయతీ భవనం

- పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో గ్రామస్థులు


అన్నారెడ్డిపాళెంలో శిథిలమైన పంచాయతీ భవనం

సంగం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం గ్రామం నడిబొడ్డున ఉన్న శిథిలమైన పంచాయతీ భవనం ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. నాలుగు దశాబ్దాల కిందట ఈ పంచాయతీ భవనం నిర్మించారు. ఇది పెచ్చులూడి శ్లాబు కమ్ములు బయటకు దర్శనమిస్తున్నాయి. దీన్ని పదేళ్ల కిందట నిరుపయోగంగా వదిలేశారు. అయితే ఇళ్ల మధ్య ఈ భవనం ఉంది. గదులకు తాళం వేసినా వరండాలో పిల్లలు ఆడుకుంటూ అటువైపు వెళ్తున్నారు. గోడలు, శ్లాబు శిథిలాస్థితిలో ఉండడంతో ఎప్పుడు కూలుతుందో.. ఎటువంటి చెడువార్త వినాల్సి వస్తుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు.

రూ. 10 లక్షలతో నూతన భవనం

పంచాయతీ భవనం శిథిలాస్థితికి చేరడంతో ఉపాధి నిధుల నుంచి పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పాత భవనం తొలగించి కొత్త భవనం నిర్మించాల్సి ఉన్నా పాత భవనం తొలగించడానికి నిధులు మంజూరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో వేరే చోట పంచాయతీ భవనం నిర్మించారు. పాత భవనాన్ని వదిలేశారు. ఈ భవనం వల్ల ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై వామపక్ష పార్టీల నిరసన



కావలి: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

కావలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను కించపరుస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షపార్టీలు సోమవారం సాయంత్రం స్థానిక ట్రంక్ రోడ్డు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల నేతలు పెంచలయ్య, నాగరాజు, లక్ష్మిరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్‌లు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తూ ప్రజల హక్కులను కాలరాస్తుందని ఆరోపించారు. రాబోయే రోజులలో వామపక్షాలు చేసే పోరాటాలలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు నాయకులు కృష్ణమోహన్, పీ.తిరిపాలు, బీ. కృష్ణయ్య, దర్గాబాబు, బోసు, శ్యామల పాల్గొన్నారు.

● కందుకూరు: అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీల నాయకులు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ముప్పరాజు కోటయ్య, సురేష్‌బాబు, మోహన్‌రావులు, గౌస్ బాషా, ఆనందమోహన్, నత్తా రామారావు, దుర్గా ప్రసాద్, బాల బ్రహ్మాచారి, ఉప్పు టూరి మాధవరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

● ఉదయగిరి : పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పట్ల చేసిన వ్యాఖ్యలపై స్థానిక మసీదు కాంప్లెక్స్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య, బండగానిపల్లి ఎంపీటీసీ కాకు విజయమ్మ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● జలదంకి : కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కేంద్రమంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం వారు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేస్తూ అమిత్‌షాకు వ్యాఖ్యలకు, ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు మాల్యాద్రి, రావి మాల్యాద్రి, మేలంగి ఆంథోనీబాబు, సిపిఐ నాయకుడు దమ్ము దర్గాబాబు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలి

● యూటీఎఫ్ నేతల ర్యాలీ



ఉదయగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5, 6, 7, 8వ తేదీల్లో కాకినాడలో నిర్వహించే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శేషు, చలపతి కోరారు. స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా ప్రచార జాత సోమవారం రాత్రి ఉదయగిరికి చేరుకొంది. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సర్కిల్ నుంచి జూనియర్ కళాశాల వరకు నినాదాలతో కూడిన ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, సుబ్బారెడ్డి, ఫణిరాజ్, దస్తగిరిఅహ్మద్, రామిరెడ్డి, హనీఫ్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: పట్టణంలో సోమవారం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల ప్రచార జాతాకు ఆత్మకూరు డివిజన్ ఉపాధ్యాయులు, స్థానిక యూటిఎఫ్, సీఐటీయు, అనుబంధ సంఘాల నేతలు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద స్వాగతం పలికారు. అనంతరం ప్రచార జాత పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగింది. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చలపతిశర్మ, వివి శేషు పాల్గొన్నారు.

● వింజమూరు : పట్టణంలో సోమవారం యూటీఎఫ్ వింజమూరు శాఖ ఆధ్వర్యంలో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చెంచలబాబు యాదవ్ మాట్లాడుతూ జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో జరిగే సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేసుకుందాం

● కావలి టౌన్ : ఉపాధ్యాయులందరూ ఐక్యంగా ప్రభుత్వంపై పోరాడి జీవో నెంబర్ 117ను రద్దు చేసుకుని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు పిలుపునిచ్చారు. కాకినాడలో జనవరి 5,6,7 తేదీలలో స్వర్ణోత్సవాలు జరుగుతాయని, ఈసందర్భంగా పట్టణంలో చేపట్టిన ప్రచారజాతలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బెల్లంకొండ మాధవ, శ్రీదేవి, కిలారి వెంకటేశ్వర్లు, ప్రసాద్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ పట్ల విద్యార్థులు మక్కువ పెంచుకోవాలి


ఉదయగిరి: విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎంఈవో

ఉదయగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల మక్కువ పెంచుకోవాలని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ సైన్స్ ఫేర్‌లో ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని 15 ప్రదర్శనలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మధుకిరణ్, అధ్యాపకులు రమేష్, కౌసల్యలు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారు. ఎంపికైనన వారిని జిల్లాస్థాయికి సిఫార్సు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలకేశవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: స్థానిక జడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను సోమవారం నిర్వహించారు. మండలంలోని ఏడు జడ్పీ హైస్కూల్స్, మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు. గుంపర్లపాడు, చిరమన విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు జ్యోతి, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

● సీతారామపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈవో మస్తాన్‌వలి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఓగురువాండ్లపల్లి, సీతారామపురం , అయ్యవారిపల్లి, బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఈ పోటీ పాల్గొనగా వ్యక్తిగత విభాగంలో సీతారామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రూప్ కేటగిరి, టీచర్ కేటగిరిలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ తోట ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● వింజమూరు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం మూడు విభాగాల్లో సైన్స్‌ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను 8, 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులు జనవరి 3వ తేదీన నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్ పోటీలలో పాల్గొంటారని ఎంఈవో ఎం.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులపై శిక్షణ

బిట్రగుంట, (దగదర్తి) డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):గాడ్ గ్రే వ్యవసాయ అనుబంధ ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులకు సోమవారం మండలకేంద్రంలో జిల్లా సహకార శాఖ అధికారి బి.గురప్ప శిక్షణ ఇచ్చారు. నిర్వహించారు. ఆరానిక్, ప్రకృతి వ్యవసాయం పద్ధతులను రైతులకు అలవాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రారు ఉమామహేశ్వరి, సీనియర్ ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నిందితులపై చర్య తీసుకోవాలి

కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడులో యాదవ కులస్థులపై దాడిచేసిన వ్యక్తులను చట్టపరంగా శిక్షించాలని యాదవ జేఏసీ నాయకులు మిరియం శ్రీనివాసులు, చిరుమామిళ్ల గోపీకృష్ణ, అమ్మనబ్రోలు మాధవ, నాగేశ్వరరావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఘర్షణలో గాయపడిన వ్యక్తులను కందుకూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.

కులగణనలో ఎస్సీలకు అన్యాయం

● అంబేడ్కర్ యువజన సంఘం ఆందోళన


అల్లూరు : తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న ఎస్సీ నేతలు

అల్లూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో పనిచేసిన వాలంటీర్లు చేపట్టిన కులగణనలో ఇతర కులాలను ఎస్సీలోకి చేర్చి అసలైన ఎస్సీలకు తీరని అన్యాయం చేశారంటూ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సోమవారం వారు తహసీల్దారు, ఎంపీడీఓలకు వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇష్టారీతిలో సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదించడంతో వారు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారని వాపోయారు. ఎస్సీల్లోకి చేర్చిన వారి పేర్ల వివరాలు పంచాయతీల్లోని నోటీసు బోర్డులపై అతికిస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్లు సాల్మన్‌రాజు, పొంగులూరు శ్రీనివాసులు, గంగపట్నం శ్రీనివాసులు, ముసలి నరేంద్ర, పొంగులూరు సుధాకర్, గాలి వేణుగోపాల్ పాల్గొన్నారు.

● కందుకూరు : పట్టణంలోని పలు వార్డుల్లో ఎస్సీ కులగణన జాబితా అనేక తప్పుల తడకలగా ఉందని అంబేడ్కర్ మాల సంఘాల జేఏసీ పాలేటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులతో కలిసి సబ్ కలెక్టర్ శ్రీపూజకు సోమవారం వినతిపత్రం అందచేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

● ఉలవపాడు: ఎస్సీ వర్గీకరణ దిశలో భాగంగా ప్రభుత్వం ఆయా పంచాయతీలు, సచివాలయాలకు పంపిన జాబితాలో అవకతవకలు ఉన్నాయని మండల ఎస్సీ మాలల సంఘం నాయకులు సోమవారం సచివాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎంపీడీవో విజయ, తహసీల్దారు లావణ్యను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో చాకిచర్ల, భీమవరం, బద్దిపూడి, వీరేపల్లి గ్రామాల మాల సంఘం నాయకులు ఉన్నారు.

పోలీసు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

● సీఐ జి గంగాధర్, ఆత్మకూరు



ఆత్మకూరు, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ డిసెంబరు 31వ తేదీ రాత్రి నిర్వహించే వేడుకల్లో పోలీసు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ జి గంగాధర్ సోమవారం హెచ్చరించారు.

ఈ ఇంటర్వ్యూ

? నూతన సంవత్సర వేడుకలపై ఎలాంటి ఆంక్షలు విధించారు

! అర్ధరాత్రి రోడ్లపై వేడుకలకు అనుమతులు లేవు. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేసినా, బాణాసంచా పేల్చినా చర్యలు తీసుకుంటాం.

? డ్రగ్స్ నియంత్రణకు ఏం చేస్తున్నారు.

! గంజాయి వినియోగం, రవాణా కేసుల్లో పట్టుబడుతున్న వారిలో యువత ఎక్కువగా ఉంటున్నారు. వీరి ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు రాబడుతూ మూలాలకు కారణమైన వారిని పట్టుకుంటున్నాం.

? శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టారు.

! ప్రత్యేక నిఘా ద్వారా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలతో మమేకమవుతూ ఎలాంటి గొడవలు జరగకుండా ప్రణాళికతో వ్యవహరిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఆర్వో సిస్టం ప్రారంభం

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం సీడ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి, ఆయన సతీమణి సబితారెడ్డి ఆర్వోసిస్టంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యశాలకు వచ్చే రోగులు, సిబ్బందికి శుద్ధి జలం అందించేందుకు తమ సంస్థ ద్వారా ఆర్వోసిస్టం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఏఎస్ అధికారి డబ్ల్యూ ఆర్ రెడ్డి, వైద్యాధికారి అయూబ్‌అఫ్సర్, సీడ్స్ వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురై మృతి చెందిన జలదంకి రమణయ్య(51) మృతదేహాన్ని సోమవారం దిగా పోలీసులు సోమవారం స్థానిక క్రిష్టియన్ పేటలో గుర్తించారు. గుడ్లూరు మండలం రాళ్ల పాడుకు చెందిన రమణయ్య ఆరోగ్యం సరి లేక పట్టణంలోని తన సోదరుడు ప్రకాశం ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం నుంచి కనిపించక పోవడంతో వెతుకులాట ప్రారంభించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

బహిరంగ వేలం

బిట్రగుంట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి 2025లో జరుగనున్న బ్రహ్మోత్సవాల వేలం సోమవారం ఆలయ ఈవో రాధకృష్ణ ఆధ్వర్యంలో కోవూరు టెంపుల్స్ గ్రూప్స్ ఈవో సీహెచ్ కృష్ణప్రసాద్ చేపట్టారు. కొబ్బరి కాయలు, పూజాద్రవ్యాలు, చెరుకు అమ్ముకునే హక్కులకు పొందేందుకు వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. అలాగే తలనీలాల సేకరణ, తాత్కాలిక షాపుల వేలం నిర్వహించారు. పాదరక్షల సేకరణ, రంగుల రాట్నం వేలం వాయిదా పడినట్లు తెలిపారు.

2013 చట్టం అమలు చేయాలి

కందుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు పరిధిలోని అనుబంధ పరిశ్రమల కోసం జరిగే భూసేకరణలో భూములను వర్గీకరణ చేసి 2013 చట్టాన్ని అమలుచేయాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, నూతల పాటి వెంకటేశ్వర్లు సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మాణాన్ని ధిక్కరిస్తు ఏక పక్షంగా ధర నిర్ణయించడం సరైనది కాదని పేర్కొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గ సమావేశం

కొండాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏపీటీఎఫ్ 1938లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.సురేంద్రరెడ్డి, ఎమ్.పిచ్చి బాబులు హాజరై ఉపాధ్యాయులు, విద్యా సమస్యలపై చర్చించారు. సమావేశంలో మాధవ రెడ్డి, ఎమ్.శ్రీనివాసులురెడ్డి ఉపాధ్యాయులు సంఘం సభ్య త్వాన్ని స్వీకరించారు.

పుట్‌బాల్ విజేత జయరాజ్ జట్టు

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): రైల్వే పుట్‌బాల్ క్రీడా మైదానంలో రెండురోజుల పాటు జిల్లాస్థాయి పుట్‌బాల్ పోటీలు జరిగాయి. అందులో భాగంగా సోమవారం జరిగిన పైనల్ పోటీలో ఎన్‌డీఎఫ్ఏ నెల్లూరు జట్టుపై కెఎస్ జయరాజ్ జట్టు విజేత నిలిచినట్లు నిర్వాహకులు స్టీవెన్‌కుమార్, నైనిల్ తెలిపారు. పోటీలో 14 జట్లు పాల్గొన్నట్లు చెప్పారు. విజేతలకు ట్రోఫీలను సీనియర్ క్రీడాకారుడు ఎస్ఏనవీద్, గనిపినేని నాగరాజు, బోగిరి ప్రభాకర్‌లు అందజేశారు.

బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం

● రోడ్డుమీద పడిన యువకుడి కాళ్లపై వెళ్లిన బొలెరో



చికిత్స పొందుతున్న రహమత్‌బాషా

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రేబాల సమీపంలోని జాతీయ రహదారిలో సోమవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బుచ్చిలోని భగత్‌సింగ్ కాలనీకి చెందిన రహమత్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. బైక్ బస్సు చక్రాల కింద పడి నుజ్జునుజైంది. స్కూటరిస్టు నడి రోడ్డుమీద పడిపోవడంతో వెనుక నుంచి వచ్చిన ఓ బొలెరో వ్యాను అతని రెండు కాళ్లపైన వెళ్లింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. నెల్లూరులో టైల్స్ పనులకు వెళ్లుండగా ఈ ప్రమాదం జరిగింది.

సైన్స్ ఫెయిర్ పోటీల్లో విజేతలకు అభినందనలు

వెంకటాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. పోటీలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు జడ్జీలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. మండల విద్యాశాధికారి వీ శ్రీనివాసులురెడ్డి, స్థానిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బీ లతా హాజరై విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు.

మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్



విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టల నమూనాలను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని దర్గామిట్ట జడ్పీ పాఠశాలలో సదరన్ ఇండియా పేరుతో సోమవారం మండల స్థాయిలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఎగ్జిబిషన్‌లో వ్యక్తిగత విభాగంలో 13, గ్రూప్‌స్థాయిలో 17, ఉపాధ్యాయుల స్థాయిలో 7 ప్రదర్శనలు పోటీ పడ్డాయి. వీటిలో ఐటీడీ రోబోట్ ఫర్ బ్లైండ్ పర్సన్ ప్రాజెక్ట్, గ్రూపు విభాగంలో ఎర్త్ క్వేక్ గార్డ్, ఉపాధ్యాయుల విభాగంలో జియోబోర్డు నమూనాలు ప్రథమస్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికయ్యాయి. ఈ ప్రాజెక్టలను డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పరిశీలించి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏఎంవో జి.సుధీర్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, ఎంఈవో మురళీధర్, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పిస్తే టిడ్కో ఇళ్లలో ఉంటాం

● కమిషనర్‌కు లబ్ధిదారుల మొర



కమిషనర్‌కు సమస్య వివరిస్తున్న టీడీపీ నేత హజరత్‌నాయుడు

నెల్లూరు(సిటీ), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే అక్కడే నివాసం ఉంటామని లబ్ధిదారులు కమిషనర్ సూర్యతేజకు మొరపెట్టుకున్నారు. సోమవారం ఎన్‌ఎంసీలో నిర్వహించిన పీజీఆర్ ఎస్‌లో 33వ డివిజన్‌కు సంబంధించిన టిడ్కో లబ్ధిదారులు టీడీపీ నాయకుడు హజరత్‌నాయుడుతో కలిసి వచ్చారు. తమకు వివిధ ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు కేటాయించారని తెలిపారు. తాళాలు తీసుకున్నవారంతా ఇళ్లలో చేరాలని లేకపోతే రద్దవుతాయని అధికారులు చెప్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సౌకర్యాలు కల్పిస్తే ఇళ్లలోకి వెళ్తామని తెలిపారు. కాగా పెద్దచెరుకూరు వద్దనున్న సిరిగార్డెన్స్‌లో డ్రైనేజీ కాలువలు, సీసీరోడ్లు నిర్మించాలని, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వ వల్ల దోమలు ఎక్కువగా ఉన్నాయని, మట్టి రోడ్లను చదును చేయాలని స్థానికులు కోరారు. నగరంలో రోడ్లను ఆధునీకరించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. కాగ నగరంలోని పలు ప్రాంతాలలో పశువైద్యుడు మదన్‌మోహన్ నేతృత్వంలో రోడ్ల పైన తిరిగే పశువులను గోశాలకు తరలించారు.

'బుగ్గన' వ్యాఖ్యలు హాస్యాస్పదం : సోమిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాల నలో రాష్ట్రాన్ని అప్పులు పాల్జేసి ఆర్థిక సంక్షోభంలో ముంచిన మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన వ్యాఖ్యలు హాస్యాస్పదమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వావింటపర్తిలో జరిగిన రెవెన్యూ సదస్సు లో ఆయన పాల్గొని ప్రజల నుంచి భూ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడేమో ఐదేళ్లకు పరిమితం కావాలి.. మీరేమో 30 ఏళ్లకు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టొచ్చా అని దుయ్యబట్టారు.

త్వరలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

పొదలకూరు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో త్వరలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పులిపాటి వెంకటరత్నంనాయుడు, తహసీల్దారు శివబాలకృష్ణయ్య, ఎంపీడీవో నరసింహా రావు, ట్రాన్స్‌కో డీఈ సుబ్రహ్మణ్యం, హౌసింగ్ డీఈ జహీరుద్దీన్, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వెంకటాచలంలో పర్యటన

వెంకటాచలం,(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం మండలంలో జరిగే పలు కార్యక్రమాలకు హాజరుకానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. వెంకటాచలం, కనుపూరు గ్రామాల్లో జరిగే పింఛన్ల పంపిణీతోపాటు కనుపూరు చెరువులో చేప పిల్లలను సోమిరెడ్డి విడుదల చేయనున్నారు. కూటమి నేతలు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సజ్జాపురం గ్రామ సర్పంచు చెక్‌పవర్ రద్దు

● ఈవోపీఆర్డీకి మూడు నెలల ఇన్‌చార్జి బాధ్యతలు

నెల్లూరురూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారన్న కారణంతో నెల్లూరురూరల్లోని సజ్జాపురం గ్రామ పంచాయతీ సర్పంచు అప్పుకూటి నారాయణ చెక్‌పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎల్ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులివ్వగా అవి సోమవారం బయటకొచ్చాయి. కార్యాలయ వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు.. సజ్జాపురంలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయినట్లు అందిన ఫిర్యాదు మేరకు జూలైలో డీఎల్‌పీవోతో విచారణ నిర్వహించగా సాధరణ నిధులు రూ.1.97 లక్షల్లో రూ.54,350 ఖర్చు చేసినట్లు బిల్లులు చూపారని, మిగిలిన రూ.1.43 లక్షలకు లెక్కలు లేవని విచారణ తేలిందని డీపీవో తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.25 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు లేవన్న విషయాన్ని డీఎల్‌పీవో విచారణ గుర్తించారని ఆయన పేర్కొన్నారు. గ్రామ సర్పంచుతో పాటు ఉపసర్పంచు, ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు కాల వ్యవధిలో ఈ నిధులు గల్లంతైనట్లు తేలిందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్ చట్టం మేరకు సర్పంచు అప్పుకూటి నారాయణకు చెక్‌పవర్ రద్దు చేస్తూ ఆ బాధ్యతలను మూడు మాసాల పాటు మండల విస్తరణ అధికారి (ఈవోపీఆర్డీ)కి అప్పగిస్తున్నట్లు డీపీవో పేర్కొన్నారు. పంచాయతీకి సంబంధించిన అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు ఈవోపీఆర్డీ ద్వారానే జరుగుతాయని డీపీవో వెల్లడించారు.

ఇది ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వం

● ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి ఆనం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇది ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. సోమవారం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ)-2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ఉద్యోగులు కూటమి ప్రభుత్వానికి అండగా ఉండి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బి. సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మల్లికార్జున, మహిళా నాయకురాలు సుజాతాబాయి, కిరణ్ కుమార్, ఆర్. శ్రీనివాసులు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ అవిష్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు(వైద్యం,ఆంధ్రజ్యోతి): ఎస్‌కేబీ ఫౌండేషన్, ఇందిరాగాంధీ మైనార్టీ సేవాసదన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఉడతా వెంకట్రావు, ఏటూరి శ్రీనివాసులరెడ్డి, ఎస్‌కేబీ ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ అల్లాఉద్దీన్, రెహమాన్ హాజీ మహమ్మద్ హనీఫ్, బ్రహ్మయ్య, కిశోర్, హుస్సేన్ బాషా, మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ..

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏపీటీఎఫ్ నూతన సంవత్సరం డైరీ, క్యాలెండర్‌ను సోమవారం జిల్లా విద్యా శాఖాధికారి డాక్టర్ ఆర్.బాలాజీరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర సబ్ కమిటీ సభ్యుడు రియాజ్ పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండరు..

పొదలకూరు,(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ పొదలకూరు మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సీ ఆవరణలో మండల విద్యాశాఖ అధికారుల చేతుల మీదుగా ఏపీటీఎఫ్ వాల్ క్యాలెండరు, టేబుల్ క్యాలెండరు, ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రేణుక, శోభనాద్రి మండలంలోని ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఏపీటీఎఫ్ పొదలకూరు మండల శాఖ అధ్యక్షుడు రాచమల్లు మాల్యాద్రిరెడ్డి, జనరల్ సెక్రటరీ మోడిబోయిన శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్లు ఎస్ సునీల్‌కుమార్, ఎస్‌కె సుభాన్, వై జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న డీఈవో బాలాజీరావు

కామాక్షితాయి ఆలయంలో నూతన సంవత్సర ఏర్పాట్లు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయ ఆలయానికి వచ్చే భక్తుల సౌర్యార్థం అన్ని ఏర్పాట్లు చేపడతామని ఆలయ ఈఓ ఏవీ.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9గంటల వరకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పిస్తామన్నారు. రాత్రి 7గంటల నుంచి ప్రత్యేక నిత్య కళ్యాణోత్సవం, 9 గంటల నుంచి పెద్ద వెండి నందిసేవ, గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులకోసం ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, ఉచితప్రసాదం, అన్నప్రసాద వితరణ, లడ్డు, పులిహోర ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో చాంపియన్‌షిప్

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో నగరంలోని వేదవ్యాస స్కూలులో 10వ తరగతి చదువుతున్న అరవింద్‌నగర్‌కు చెందిన పనుగోటి యశస్విని చాంపియన్‌షిప్, బంగారు పతకం సాధించింది. ఆమె త్వరలో జరగబోయే అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికైందని కరాటే మాస్టర్ షేక్.షాకీద్ తెలిపారు. ఆమెను పలువురు అభినందిచారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్‌గా బలరామయ్యనాయుడు

నెల్లూరు(విద్య), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వాకర్స్ ఇంటర్నేషనల్ 203 వాకర్ జిల్లా గవర్నర్‌గా నలుబోలు బలరామయ్యనాయుడు ఎంపికయ్యారు. ఏలూరులో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో అధ్యక్షుడు మురళీమోహన్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్‌తో పాటు వాకర్స్ ఇంటర్నేషనల్‌లో పలు సేవలందించిన ఆయనను మూడు జిల్లాల ప్రతినిధిగా నియమించారు. ఆయన గవర్నర్‌గా ఎంపికవడంతో జిల్లాలోని పలు వాకర్స్ సంఘాలు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

డివిజన్ల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరురూరల్ నియోజకవర్గంలో గ్రామాలు, డివిజన్ల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. 19వ డివిజన్ పరిధిలోని ముత్యాలపాళెంలో రూ.45 లక్షలతో పార్కు అభివృద్ధి, రామలింగాపురం వద్ద రూ.20 లక్షలతో సీసీరోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూరల్లోని ఆమంచర్లలో జంక్షన్ వద్ద రూ.35 లక్షలతో సీసీరోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మారంరెడ్డి జ్యోతిప్రియ, నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, మలినేని వేణునాయుడు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనవరి 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు కోరారు. ఈ మహాసభలకు పిలుపునిస్తూ సోమ వారం ఉదయం నెల్లూరు నుంచి బుచ్చికి చేరుకున్న ప్రచారజాతకు వారు ఆహ్వా నం పలికారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్కు సెంటర్లో యూటీఎఫ్ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఎం.అచ్చయ్య, నాగిరెడ్డి, గోపాలకృష్ణమూర్తి, బి.గోపి నాయకులు పాల్గొన్నారు.

ఇళ్లల్లోనే 'నూతన' సంబరాలు : రూరల్ సీఐ

నెల్లూరురూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర సంబరాలను ప్రజలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లలోనే జరుపుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో నిర్వహిస్తే కేసులు పెడతామని నెల్లూరురూరల్ సీఐ జీ వేణు సూచించారు. సోమవారం ఆయన స్టేషన్‌లో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన సంవత్సర సంబరాలుపై నిషేధాజ్ఞలు ఉన్నాయని తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, కూడళ్లు, ప్రధాన రోడ్లు, రహదారులు, కాలనీల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు పోలీసు నిఘా ఉంటుందన్నారు. ప్రజలకు ఇబ్బందికలిస్తే తన ఫోన్ నెం.9440796319కు సమాచారం ఇవ్వాలన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై వీఎస్‌యూ ప్రత్యేక దృష్టి

● వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్‌రావు



మాట్లాడుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

వెంకటాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీ తదితర రంగాలపై విక్రమ సింహపురి యూనివర్సిటీ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో సోమవారం కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సమన్వ యకర్త దివంగత డాక్టర్ కే రమేష్‌రెడ్డి జ్ఞాపకా ర్థం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డాక్టర్ నరేష్‌బాబు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ అందే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు అభినందన

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ శివాజీ యూనివర్సిటీ పరిధిలోని లక్ష్మీబాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ క్యాంపస్‌లో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో వీఎస్‌యూ తరపున పాల్గొని ప్రతిభ కనబరిచిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సారంగం విజయభాస్కర్‌రావు అభినందించారు. వీఎస్‌యూలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వారికి సర్టిఫికెట్లు, మెమోంటోలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, విడవలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దీన్‌దయాల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్, డాక్టర్ బీ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గోదాముల వద్ద పటిష్ట భద్రత ఉండాలి : కలెక్టర్



ఈవీఎం గోదాముల వద్ద కలెక్టర్ ఆనంద్, ఆర్డీవో అనూష

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం నెల్లూరు ఆర్డీవో అనూష, పలు పార్టీల నాయకులతో కలసి గోదాములను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీసులతో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు అర్బన్ తహసీల్దారు షఫీమాలిక్ పాల్గొన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి : వామపక్షాలు



రాస్తారోకో చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

కోవూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను పార్లమెంటులో అగౌరవపరస్తూ మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని వామపక్షాల నాయకులు, కార్యకర్తలు నిరసిస్తూ సోమవారం స్థానిక బజారు కూడలిలో రాస్తారోకో చేపట్టారు. అనంతరం బజారు కూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శనగా వెళ్లి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు గండవరపు శేషయ్య, బుజ్జయ్య, విజయకుమార్, సుబ్బారావు, హరి, సీపీఐ నేతలు ఎన్. రమణయ్య, కామేశ్వరరావు, అఫ్రోజ్ పాల్గొన్నారు.

మండల స్థాయి సైన్స్ ఫెయిర్ పరిశీలన



నమూనాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శివకుమార్

సైదాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శనను ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తొమ్మిది జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో ప్రతిభ కనపరచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు దయాకర్, సుప్రియ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

ముత్తుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని మండల విద్యాశాఖ అధికారి మధుసూదన సూచించారు. సోమవారం ముత్తుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సదరన్ ఇండియా మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన -2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా వైజ్ఞానిక ప్రదర్శనలు ఉన్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ న్యాయవాది టీవీ శేషాద్రి చనిపోవడానికి, అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లిలో సీఐ, పోలీసులు న్యాయవాది సుదర్శన్‌రెడ్డిపై చేసిన దాడికి నిరసనగా, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం కోర్టు విధులను బహిష్కరించి తమ నిరసన తెలియజేయాలని బార్ అసోసియేషన్ తీర్మానించినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, పి.సుందరయ్య యాదవ్ తెలిపారు. ఈ మేరకు బార్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సోమ వారం మధ్యాహ్నం అత్యవసరంగా సమావే శమై ఈ నిర్ణయం తీసుకున్నట్టు వారు తెలిపారు. ఈ సంఘటనకు బాధ్యులైన పోలీ సు అధికారులపై తగు చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు.

యువకుడి అదృశ్యం

వెంకటాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంటేపల్లి గ్రామంలో నివాసముంటున్న సాయికృష్ణ ఇంట్లో నుంచి ఎక్కడికో వెళ్లియాడని తల్లి ప్రమీల సోమ వారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చవటపాళెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా రావూరి



వెంకటాచలం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చవటపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడిగా రావూరి రాధాకృష్ణమనాయుడు ఆదివారం ఎంపికయ్యారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రావూరి పేరును ప్రతిపాదించారు. నిడిగుంటపాళెం గ్రామానికి చెందిన రాధాకృష్ణమనాయుడు ప్రస్తుతం తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. సోమవారం పలువురు ఆయనను అభినందించారు.

కృష్ణపట్నం... పల్లంరెడ్డి



ముత్తుకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణపట్నం వ్యవసాయ సహకార పరప తి సంఘం అధ్యక్షుడిగా పంటపాలెంకు చెం దిన పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డిల సహకారంతో పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు పల్లంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పొదలకూరు... తలచీరు



పొదలకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా తలచీరు మస్తాన్‌బాబు ఎంపికయ్యారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మస్తాన్‌బాబు పేరును ప్రతిపాదించారు. మస్తాన్‌బాబును టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

మురుగు సమస్యలు పరిష్కరించండి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీలోని 16వ వార్డు పరిధిలోని ప్రాంతాల్లో డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి మురుగు సమస్యలు పరిష్కరించాలని 16వవార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజామురళికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా మనోహర్ రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండలాధ్యక్షుడిగా సాల్మానుపురం సిద్దన మనోహర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి భాస్కర్ గౌడ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మనోహర్‌రెడ్డికి నియామకపత్రం అందజేశారు. సోమవారం బుచ్చిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయుకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడారు. నూతన అధ్యక్షుడిని పూలమాలలు, శాలువాలతో డాక్టర్ కృష్ణారెడ్డి సత్కరించారు.

యువకుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం,(ఆంధ్రజ్యోతి): మినగల్లు పాలేటి గోపి(31) అనారోగ్యంతో మనస్థాపానికి గురై ఈ నెల 20న గడ్డిమందు తాగి నెల్లూరు ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



తిరుమలలో పీఎస్‌ఎల్వీ-సీ60 నమూనాకు పూజలు

తిరుమల/సూళ్లూరుపేట, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోట షార్ నుంచి ప్రయోగించనున్న పీఎస్‌ఎల్వీ-సీ60 నమూనాకు తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిప్రయోగానికి ముందు ఇస్రో శాస్త్రవేత్తలు, అధికారులు ఇలా తిరుమల రావడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఇస్రో డైరెక్టర్ దినేష్‌కుమార్ సింగ్, పిన్సిపల్ సెక్రటరీ యశోద, ఎన్‌ఏఆర్‌ఎల్ డైరెక్టర్ అమిత్‌కుమార్ పాత్ర, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌గుప్తా బృంద సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో నమునాతో ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. మరోవైపు, సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరిని సోమవారం ఇస్రో చైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్ దర్శించుకొని పూజలు చేశారు. ఆస్థాన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, షార్ గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.


శ్రీవారి ఆలయం వద్ద ఇస్రో అధికారుల బృందం



మీడియా సెంటర్‌లో మాట్లాడుతూ రాకెట్, ఉపగ్రహ నమూనాను చూపుతున్న ఇస్రో చైర్మన్ సోమనాథ్, శాస్త్రవేత్తలు - రెండో దశ.. - నాలుగో దశ

ఇస్రో విజయాశ్వం
మరోసారి విజయం

● పీఎస్‌ఎల్వీ-సీ 60 రాకెట్ ప్రయోగం విజయంతో శాస్త్రవేత్తల్లో హర్షాతిరేకాలు

సూళ్లూరుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇస్రో విజయాశ్వం పీఎస్‌ఎల్వీ మరోసారి విజయకేతనం ఎగురవేసింది. విభిన్న ప్రయోగాలకు పీఎస్‌ఎల్వీ వాహక నౌక బ్రహ్మాస్త్రంలా మారింది. సోమవారం రాత్రి 10 గంటల 15 సెకన్లకు ప్రయోగించిన పీఎస్‌ఎల్వీ-సీ 60 విజయవంతమైంది. ఈ రాకెట్ ద్వారా స్పాడెక్స్ జంట ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా విడిచిపెట్టడంతో షార్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. బుడిబుడి అడుగుల ప్రస్థానంలో ప్రారంభమైన పీఎస్‌ఎల్వీ నేడు విదేశీ ఉపగ్రహాలనూ సునాయసంగా అంతరిక్షంలోకి చేర్చేస్థాయికి చేరింది. ఇస్రోకు పీఎస్‌ఎల్వీ రామబాణంగా మారింది. ఒకేసారి 10, 20, 38, 104 ఉపగ్రహాలను విజయవంతంగా చేర్చి ప్రపంచ స్థాయిలో పేరు కూడా పీఎస్‌ఎల్వీకే దక్కింది. ఇప్పటి వరకు షార్ నుంచి 62 పీఎస్‌ఎల్వీ ప్రయోగాలు చేపట్టగా కేవలం రెండు మాత్రమే విఫలం చెందాయి. ఈ రాకెట్ ద్వారా 505 ఉపగ్రహాలను ప్రయోగించగా ఇందులో 433 విదేశీ.. 70 స్వదేశీ ఉపగ్రహాలు, పలు వర్సిటీలకు చెందిన 13 బుల్లి ఉపగ్రహాలు ఉన్నాయి.



రోడ్‌షోలు.. హామీలు.. ప్రలోభాలు.. బెదిరింపులు.. అయినా ప్రశాంతంగానే ఎన్నికలు జరిగాయి. ఆశలు, అంచనాలు తలకిందులయ్యాయి. జగన్ పార్టీకి తీవ్ర భంగపాటును 2024 మిగిల్చింది. చంద్రబాబు సారధ్యంలోని కూటమికి అనూహ్యమైన విజయాన్ని అందించింది. విర్రవీగి, నోటికి పనిచెప్పిన నేతలంతా నేలకరిచారు. అప్పులకుప్పగా మిగిలిన ఏపీలో ఒక సవాలుగా కూటమి పాలన మొదలైంది. రెండు భిన్న దృశ్యాలకు సాక్షిగా మిగిలిన 2024లో తిరుపతి జిల్లాపై ప్రభావం చూపిన ప్రధాన సందర్భాల సమాహారం ఇది..

1 — 14 మే — పులివర్తి నానిపై దాడి



చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద జరిగిన హత్యాయత్నం రాష్ట్రంలోనే సంచలనం అయ్యింది. వైసీపీ బరితెగింపు రాజకీయాలను ఈ సంఘటన బట్టబయలు చేసింది. మే 13న పోలింగ్ జరగగా మరుసటి రోజు మహిళా వర్సిటీ ఆవరణలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించేందుకు వెళ్ళిన పులివర్తి నానీపై వైసీపీ వర్గీయులు సమ్మెట, కర్రలతో దాడి చేశారు. నానీ వాహనం ధ్వంసం అయ్యింది. ఆయన గాయపడ్డారు. ఈ దాడి దృశ్యాలు సీసీ కెమెరాలు, నానీ వాహనానికి అమర్చిన కెమెరాల పుటేజీల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వైరల్ అయ్యాయి. దీనిపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని నానీపై దాడి ఘటన సహా పోలింగ్ రోజు జరిగిన ఘటనలపైనా దర్యాప్తునకు సిట్‌ను నియమించింది. ఈ ఘటన చంద్రగిరి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలను తారుమారు చేసింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు తనను హత్య చేసేందుకు కుట్ర పన్నారంటూ నానీ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

2 — 4 జూన్ — దిమ్మదిరిగేలా ఫలితాలు



ఈ ఏడాది మేలో జరిగిన ఎన్నికలు జగన్ పార్టీకి దిమ్మతిరిగే తీర్పునిచ్చాయి. వైసీపీ ఎమ్మెల్యేల, వారి అనుచరుల అరాచకాలను భయంతో మౌనంగా భరించిన ప్రజలు ఓట్ల ద్వారా తమ వ్యతిరేకతను ప్రకటించారు. తిరుపతి, చంద్రగిరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, సూళ్ళూరుపేట, గూడూరు తదితర ఆరు పూర్తి నియోజకవర్గాలు, నగరి, వెంకటగిరి తదితర రెండు పాక్షిక నియోజకవర్గాలు.. మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లోనూ వైసీపీ తుడిచిపెట్టుకుపోయింది. చావుతప్పి కన్నులొట్టపోయిన చందంగా వైసీపీ తిరుపతి ఎంపీ స్థానాన్ని మాత్రమే అదీ స్వల్ప తేడాతో నిలబెట్టుకుంది.

3 — 12 జూన్ — ముఖ్యమంత్రిగా మూడోసారి

నారావారిపల్లె బిడ్డ చంద్రబాబు నాయుడు మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అదేరోజు తిరుమలకు వచ్చిన ఆయన జూన్13న శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే అక్టోబరు4వ తేదీన మరోసారి తిరుమలకు చేరుకుని బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించారు.



7 — 4 నవంబరు — రాజకీయ అత్యాచారం

ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద ప్రాంతానికి చెందిన ఓ మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందంటూ అధికారం కోల్పోయిన వైసీపీ నేతలు నానా రచ్చ చేశారు. సోషల్ మీడియాలో హోరెత్తించారు. ఆసుపత్రిలో ఉన్న బాలికను పరామర్శించేందుకు



రోజా, భూమన కరుణాకరరెడ్డి, అభినయరెడ్డి, నారాయణస్వామి వచ్చి నిరసన తెలిపారు. నా బిడ్డపై దాడి మాత్రమే జరిగిందంటూ తండ్రి చేతులు జోడించి వేడుకోవాల్సి వచ్చింది. తమ కుమార్తె భవిష్యత్తును దెబ్బతీశారని మైనర్ బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడంటూ పోలీసులు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు మరికొందరిపై పోక్సో, ఎస్సీ అట్రాసిటీ తదితర చట్టాల కింద కేసు నమోదు చేశారు. అయితే పోలీసులు తనతో తప్పుడు ఫిర్యాదు చేయించారని ఆ తర్వాత తండ్రి , భూమన కరుణాకర్‌రెడ్డి ఇంట్లో మీడియాతో తెలిపారు. మొత్తం మీద ఈ వ్యవహారం పేద దళిత మైనర్ బాలిక కుటుంబంపై జరిగిన రాజకీయ అత్యాచారంగా పరిణమించింది.

4 — 12 ఆగస్టు — తిరుపతిని కుదిపేసిన టీడీఆర్ బాండ్లు

తిరుపతి అసెంబ్లీ ఎన్నికను తీవ్రంగా ప్రభావితం చేసిన అంశం మాస్టర్‌ప్లాన్ రోడ్ల అవినీతి. అధికార వైసీపీ దీనిని గొప్ప అభివృద్ధి అని చెప్పుకోగా విపక్షాలు దీని వెనుక అవినీతి ఉందని ఆరోపణలు చేశాయి. కొన్ని రోడ్లకు భూమన కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉన్న టీటీడీ పాలకమండలి నిధులు ఇవ్వాలని తీర్మానించడం పెను వివాదంగా మారింది. రోడ్ల విస్తరణ పేరుతో టీడీఆర్ బాండ్ల జారీ వెనుక వెయ్యి కోట్లకు పైగా అవినీతి జరిగిందని టీడీపీ నాయకుడు ఆనం వెంకటరమణారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై విచారణ ఆగస్టు 12న విచారణకు ఆదేశించింది.



6 — 18 సెప్టెంబరు — లడ్డూలో కల్తీ నెయ్యి



భక్తులు పవిత్రంగా భావించే లడ్డూలో కల్తీ నెయ్యి కలిపి అపవిత్రం చేశారనే అంశం దేశవ్యాప్తంగా భగ్గుమంది. ఈ అంశాన్ని తొలిసారి పార్టీ సమావేశంలో చంద్రబాబు ఆవేదనగా ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వంలో టెండరు దక్కించుకున్న దిండిగల్‌కు చెందిన ప్రైవేటు డెయిరీ టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిందని శాంపిల్ పరీక్షించిన ప్రముఖ ల్యాబ్ నిర్ధారించింది. పందికొవ్వు వంటి ఆనవాళ్లు ఆ నెయ్యిలో ఉన్నాయనే ఆరోపణలు భక్తులను తీవ్రంగా కలిచివేశాయి. ఈ నేపథ్యంలో జగన్ తిరుమల పర్యటననే రద్దు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ అంశంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించగా సుప్రీం కోర్టు ఏకంగా . సీబీఐ, ఏపీ పోలీస్, కేంద్ర ఆహార భద్రత విభాగం ఉన్నతాధికారులతో సిట్ ఏర్పాటు చేసింది.

8 — 29 నవంబరు — భయపెట్టిన ఫెంగల్

ఫెంగల్ తుపాను జిల్లాను కలవరపరిచింది. వరుసగా కురిసిన నవంబరు ఆఖరులో పట్టుకున్న వానలు డిసెంబరు తొలివారం దాకా విడవలేదు. జిల్లాలోని చెరువులు నిండిపోయాయి. ప్రాజెక్టులు గేట్లు ఎత్తేశారు. వాగులు, వంకలు పొంగి రోడ్లను అడ్డగించాయి. జిల్లా తూర్పు ప్రాంతం తీవ్రంగా తుపాను ప్రభావానికి గురైంది. అయితే జిల్లా సరిహద్దుల్లో తమిళనాడులో తీరం దాటు తుందనుకున్న తుపాను కరుణించి వెళ్లిపోయింది. ఆగస్టు, సెప్టెంబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో సంభవించిన నాలుగు తుపాన్లు జిల్లాకు వానలు కురిపించాయి.



5 — 26 ఆగస్టు — కౌశిక్‌కు మానవీయ సాయం

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తిరుపతి యువకుడు కౌశిక్ (19) వార్తకు మానవీయ స్పందన లభించింది. చికిత్స కోసం రూ. 60 లక్షలు ఖర్చవుతుందంటూ తల్లి సరస్వతమ్మ మీడియా ముం కన్నీరుమున్నీరవుతూ తన కొడుకు ప్రాణం కాపావాలని వేడుకున్నారు. జూనియర్ ఎన్టీయార్ వీరాభిమాని అయిన కౌశిక్, చనిపోయే లోపు దేవర సినిమా చూడాలనుకుంటున్నాడని వెల్లడించారు. స్పందించిన జూనియర్ ఎన్టీయార్ వీడియో కాల్ చేసి కౌశిక్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. కోలుకున్నాక వచ్చి కలుస్తానని మాటిచ్చారు. కౌశిక్ తండ్రి టీటీడీలో కాంట్రాక్టు ఉద్యోగి అయినా టీటీడీ మానవీయంగా స్పందించి రూ.40 లక్షల సాయం అందించింది. చికిత్స పూర్తయ్యాక అదనంగా అయిన బిల్లు రూ. 12 లక్షలు జూనియర్ ఎన్టీయార్ చెల్లించారు. అందరి మానవీయ సాయంతో కౌశిక్ కోలుకుంటున్నాడు.


దేవర సినిమా చూసి చచ్చిపోతా
అమ్మా.. అప్పటిదాకా బతికించండి

9 — 18 డిసెంబరు — శ్రీసిటీలో ఇసుజి లక్షవ కారు



భారతదేశంలోనే అత్యంత విజయవంతమైన సెజ్‌గా శ్రీసిటీ రికార్డుల మీద రికార్డులు నెలకొల్పుతోంది. శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఇసుజి మోటార్స్ ఇండియా ప్లాంట్‌లో తయారైన లక్షవ కారును మేడిన్ ఇండియా పేరిట విడుదల చేశారు.

10 — 30 డిసెంబరు — 99వ రాకెట్ ఎగిరింది



మన జిల్లాలోని శ్రీహరికోట నుంచి 99వ రాకెట్ దిగ్విజయంగా అంతరిక్షంలోకి దూసుకుపోయింది. పిఎస్‌ఎల్వీ-సి 60 రాకెట్ రెండు ఉపగ్రహాలను మోసుకుపోయింది. మన సొంత అంతరిక్ష కేంద్రం నెలకొల్పే దిశగా సాగిన ప్రయోగం ఇది. ఇక ఈ ఏడాది శ్రీహరికోట నుంచి ఇస్రో ఐదు రాకెట్‌లను విజయవంతంగా ప్రయోగించింది. నాలుగు పూర్తిగా దేశీయ అవసరాల కోసం చేపట్టగా ఒకటి మాత్రం యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తరపున శాటిలైట్‌ను ప్రయోగించారు.

అగ్రికల్చర్ కాలేజీ ప్రొఫెసర్ ఉమామహేష్ సస్పెన్షన్

విద్యార్థినిపై లైంగిక వేధింపుల నేపథ్యంలో అధికారుల నిర్ణయం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ అగ్రికల్చర్ కాలేజీ ఫిజియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ వి. ఉమామహేష్ సస్పెండయ్యారు. విద్యార్థినిపై లైంగిక వేధింపుల నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. లైంగిక వేధింపుల నేపథ్యంలో ఆయన్ను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు. మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, రిమాండు విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు ఉద్యోగ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఉమా మహేష్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయించారు. వర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్రరావు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

రెవెన్యూ సదస్సులకు 677 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించిన 32 రెవెన్యూ సదస్సులకు 677 అర్జీలు వచ్చాయి. ఇళ్ల స్థలాలపై 376, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 17, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 21, క్యాస్ట్ వెరిఫికేషన్ 14, ఫాం 22ఏ 9, రీసర్వే 43, ల్యాండ్ గ్రాబింగ్ 7, ఆర్‌వోఆర్‌పై 122, ఇతర విషయాలకు సంబంధించి 83 అర్జీలు వచ్చాయి. వీటిలో 53అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇప్పటి వరకు 14,480 అర్జీలు వచ్చాయన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

మంగళం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరానికి ఒకరోజు ముందే మంగళవారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలో 2,63,995 మందికి రూ.112.59 కోట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో విరిగిపడిన పగడ చెట్టు కొమ్మలు

తప్పిన ముప్పు



విరిగిపడిన పగడచెట్టు కొమ్మలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం 300 ఏళ్ల నాటి పగడ చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఆ సమయానికి భక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని రాయలవారి మండపం పక్కనే పగడ చెట్టు ఉంది. ప్రస్తుతం రాయలవారి మండపంలో రూ.500 రాహుకేతు పూజలను జరిపిస్తుంటారు. అటు రాహుకేతు పూజలకు వచ్చే భక్తులతో పాటు పక్కనే ఉన్న ఉచిత ప్రసాదాలను స్వీకరించిన భక్తులు కూడా పగడచెట్టు కిందకు చేరుతుంటారు. ఈ క్రమంలో సోమవారం చెట్టు నుంచి రెండు భారీ కొమ్మలు ఒక్కసారిగా విరిగిపడ్డాయి. ఆ సమయంలో భక్తులు లేకపోవడంతో ముప్పు తప్పింది. ఇటీవల వర్షాలకు కొమ్మలునాని బరువు ఎక్కడం, చెట్టు వేరు వ్యవస్థకు నీరు చేరకపోవడం వల్ల కొమ్మలు బలహీన పడినట్లు అధికారులు భావిస్తున్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సోమవారం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,738మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,615మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,856మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,265, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 414మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 383మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 153మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,745 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

'కొండ'ంత ప్రక్షాళనకు అడుగులు

తిరుమలలో గాడిన పడుతున్న పాలన ● వైసీపీ పాలనలో అక్రమాలు.. కూటమి నేతృత్వంలో సంస్కరణలు

గతిస్తున్న ఈ ఏడాదిలో టీటీడీ మున్నెన్నడూ లేనివిధంగా జనం నోళ్లలో నానింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకాలు ఐదేళ్లు కొనసాగినా కూటమి ప్రభుత్వ ఏర్పడ్డాక బహిర్గతమై చర్చనీయాంశమయ్యాయి. దీంతో జాతీయ స్థాయిలో సైతం ముక్కున వేలేసుకునే పరిస్థితి ఏర్పడింది. దర్శనాలు మొదలుకుని లడ్డూ తయారీ వరకూ ఏమేరకు గాడితప్పాయో తేటతెల్లమైంది. జూన్ నుంచి సీఎం చంద్రబాబు నేతృత్వంలో ఆలయంలో ప్రక్షాళన ప్రారంభమైంది. కొత్త బోర్డు సారథ్యంలో కొద్ది కాలంగా నెమ్మదిగా పాలన దారిన పడుతోంది. 2024 నిష్క్రమిస్తున్న వేళ వీటిలో ముఖ్యాంశాలను ఒకసారి అవలోకనం చేసుకుందాం...

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గత పాలకవర్గంలో మరకలు

●ఎన్నికల సమయంలో కావడంతో ఈ ఏడాది తొలి నుంచీ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లు కేటాయించారు. జిల్లా మంత్రులకైతే రోజుకు 30 నుంచి 40 దర్శనాలు కూడా కేటాయించేవారు. లేఖపై ఆరుగురికే దర్శనం ఇవ్వాలనే నిబంధనను పదికి పెంచేశారు. బోర్డు ఛైర్మన్ నుంచి సభ్యుల వరకు అడ్డుఅదుపులేకుండా పోయింది.

●ముస్లింలకు శ్రీవారిసేవ అవకాశం కల్పిస్తామని, ఇతర మతస్థులపై హిందూమతంలోని పవిత్రజలాన్ని చల్లి ఆహ్వానిస్తామని ఫిబ్రవరిలో గత ఛైర్మన్ భూమన కరుణకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేసిన ప్రకటనలు తీవ్ర దుమారం లేపాయి. భక్తుల్లో ఆందోళన కలిగించాయి.

● నిబంధనలకు విరుద్ధంగా శారదామఠం తిరుమలలో చేపట్టిన నిర్మాణాలు నాటి ప్రభుత్వ తీరుకు దర్పణం పట్టింది.

● టీటీడీ, అధికారులు, బోర్డు, సీఎం, అహోబిలం మఠం, జీయర్‌స్వాములు, అర్చకులపై ఆరోపణలు చేస్తున్నట్టుగా ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై గత బోర్డు రమణదీక్షితులను టీటీడీ నుంచి తొలగించింది. కేసు కూడా నమోదు చేసింది.

● పరకామణిలో దొంగతనం కేసు తీవ్రస్థాయిలో దుమారం రేపింది. దొంగతనం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయకుండా గత టీటీడీ, పోలీసులు రాజీ కుదుర్చుకోవడంపై మొదలైన విమర్శలు నేటికీ కొనసాగుతున్నాయి.

కూటమి పాలనలో సంస్కరణలకు శ్రీకారం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీటీడీ ఈవోగా శ్యామలరావును నియమించింది. స్వామిక్షేత్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతలను అప్పగించింది. జూన్ 16న బాధ్యతలు తీసుకున్న ఆయన తొలిప్రాధాన్యతగా లడ్డూలు, అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. లడ్డూకు వాడే నెయ్యిలో నాణ్యత లేదని గుర్తించారు. కొన్ని సరఫరా సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారు. నందిని వంటి సంస్థల ద్వారా నాణ్యమైన నెయ్యి దిగుమతికి చర్యలు తీసుకుని భక్తుల ప్రశంసలకు పాత్రులయ్యారు.

● ఇక, అవసరం లేకపోయినప్పటికీ నిర్మాణాల పేరుతో కోట్లాది రూపాయలు రోడ్లు, భవనాలు, ఆస్పత్రుల పేరుతో మళ్లించడం కూడా టీటీడీ వార్తల్లో నిలిచింది. రాజకీయ లబ్ధికోసమే టీటీడీ నిధులతో తిరుపతిలో రోడ్లు వేశారనే విమర్శలు వైసీపీని వెంటాడాయి.

మారిన అన్నప్రసాదాల రుచి

అన్నప్రసాదాల నాణ్యతపై దృష్టిపెట్టారు. బియ్యం, కూరగాయలు, ముడిసరులకు ల విషయంలో శ్రద్ధ తీసుకున్నారు. దీంతో అన్నప్రసాదాల నాణ్యత మెరుగుపడింది. వైసీపీ ప్రభుత్వానికి ముందున్న పద్ధతుల్లోనే రుచికరంగా నైవేద్య అన్నప్రసాదాలను నివేదిస్తున్నారు.దిట్టం పెంచారు. భక్తులకూ స్వామి ప్రసాదాలు అందేలా చర్యలు తీసుకున్నారు.

శీఘ్ర దర్శనానికి అడుగులు

● తిరుమలక్షేత్రాన్ని గత వైసీపీ నాయకులు రాజకీయ ప్రసంగాలకు వేదికగా మార్చుకున్న తీరుపై నవంబరు 6న బీఆర్ నాయుడు ఆధ్వర్యంలోని బోర్డు తొలి సమావేశంలోనే బ్రేక్ పెట్టారు. రాజకీయాలు మాట్లాడితే కేసులు పెట్టేలా తీర్మానించారు.

● నిబంధనలు అతిక్రమించిన శారదమఠం లీజునూ రద్దు చేశారు.

● ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)టెక్నాలజీ ద్వారా గంట నుంచి రెండు గంటల్లోనే దర్శనమయ్యేలా కృషి మొదలు పెట్టారు.



● అన్యమత ఉద్యోగులను తిరుమల నుంచి పంపేలా ప్రణాళికలు రూపొందించారు.

● స్వామి సొమ్ముకు భద్రతను కల్పించేలా ప్రభుత్వ బ్యాంకుల్లోనే డిపాజిట్లు చేయాలని నిర్ణయించారు.

● గత ప్రభుత్వంలో రూ.కోట్లు కొల్లకొట్టేందుకు దారి చూపిన టూరిజం దర్శన టికెట్ల కోటాను రద్దు చేశారు.

● గత ప్రభుత్వం నిలిపివేసిన స్థానికుల దర్శన విధానాన్ని పునరుద్ధరించి తిరుపతి వాసుల మనసు గెల్చుకున్నారు. ● అర్హులకే బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారు. నాలుగైదు కిలోమీటర్లు ఉండే సర్వదర్శన క్యూలైన్లు ప్రస్తుతం కనిపించడం లేదు.

● స్వర్ణాంధ్ర విజన్-2047 తరహాలో 'తిరుమలవిజన్-2047'కి శ్రీకారం చుట్టి తిరుమల అభివృద్ధికి కసరత్తు చేస్తున్నారు.

● గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై స్టేట్ విజిలెన్స్ ఫోకస్ పెట్టింది.

'ఏపీకే ఫైల్' ఓపెన్ చేయొద్దు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): 'సైబర్ నేరగాళ్లు ఏపీకే ఫైల్‌తో న్యూ ఇయర్ విషెస్ పదాన్ని వాడుకుని ట్రెడింగ్ చేసి డబ్బులు కాజేయడానికి సిద్ధమవుతన్నారు. అలా వచ్చిన ఏపీకే ఫైల్‌ను ఓపెన్ చేయకండి. ఒకవేళ ఓపెన్ చేస్తే మీ ఫోన్ కంట్రోల్ అంతా సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోతుంది. మీ మొబైల్ యాప్స్, మొబైల్‌లో జరిగే ప్రతి కదలికలను గుర్తిస్తారు. బ్యాంకు ఖాతాల వివరాలు, ఫొటోలు, వీడియోలు, కాంటాక్టు నెంబర్లు, ఇతర ఫైల్స్ తీసుకుంటారు. మీకు తెలియకుండానే డబ్బులు కాజేస్తారు' అని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. నూతన సంవత్సర సందేశాల విషయంలో జాగ్రత్తగా ఉండాలంటూ సోమవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొబైల్‌లో ఉన్న ఏపీకే వంటి స్కామ్ ఫైల్స్‌ను తక్షణమే తొలగించాలని సూచించారు. ఎక్కడైనా సైబర్ నేరం జరిగిందని తెలిసిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ క్రైం బారిన పడినవారు తిరుపతి పోలీసు మైదానంలోని సైబర్ క్రైం ఆఫీసుకు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు.

గంజాయి స్వాధీనం

● ఇద్దరు ఒడిశా యువకుల అరెస్టు

శ్రీకాళహస్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఒడిశా యువకులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు సోమవారం తెలిపారు. ప్రభుత్వాస్పత్రి రోడ్డులో ఇద్దరు యువకులు గంజాయితో సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. గంజాయి సహా ఇద్దరిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఒడిశాకు చెందిన బిజయ్(29), సుక్కు(25)గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి సోమవారం తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా తెలిపిన ప్రకారం.. పీలేరు మండలం రేగల్లుకు చెందిన లింగం అశోక్, పీలేరుకు చెందిన క్రాంతికుమార్ 2016లో ఆటోలో నాలుగు ఎర్రచందం దుంగలను అక్రమంగా తీసుకెళుతున్నారు. ఈ విషయం తెలిసి భాకరాపేట పోలీసులు ఆటోను తనిఖీ చేశారు. నాలుగు దుంగలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

● అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం
● కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్‌కు 284 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలకు సంబంధించి వచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 284 అర్జీలు అందగా అందులో భూసమస్యలపై 148, పంచాయతీరాజ్‌కు 90 ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు.

ముంతాజ్ హోటల్ నిర్మాణం ఆపాలంటూ ధర్నా



శ్రీవారి పాదాల చెంత చేపట్టిన ముంతాజ్ హోటల్ నిర్మాణాలను నిలుపుదల చేయాలని పలు హిందూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మద్యం, మాంసం, స్పా, స్విమ్మింగ్ పూల్ వంటి వాటితో వెలుస్తున్న ముంతాజ్‌హోటల్ నిర్మాణం పూర్తయితే హిందువుల మనోభావాలు దెబ్బతింటాయని తిరుక్షేత్రాల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మా ఓంకార్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట హిందు సంఘాల నాయకులు కిరణ్, సుధాకర్‌చౌదరి, రమాదేవి, నీలకంఠ, మధు, బాబు, రాజేంద్రప్రసాద్, వెంకటేష్ ధర్నా చేపట్టారు. బీజేపీ నేతలు కూడా ఆందోళన చేపట్టారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు.

కాలనీకి రోడ్డు వేయండి

తిరుపతి నగర పరిధిలోని ఒకటో డివిజన్ అన్నమయ్య మార్గం పక్కనే ఉన్న మస్తాన్‌నాయుడు కాలనీ(కొత్తపల్లి)కి రోడ్డు వేయాలని కాలనీ వాసులు కలెక్టర్‌ను కోరారు. గుంతలమయంగా ఉన్న మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ వ్యవస్థ లేక ఇళ్ల మధ్యే మురుగునీరు ప్రవహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, తమ ఇళ్లను అన్యాయంగా కూల్చివేశారని, న్యాయం చేయాలని రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లె వాసులు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్



శ్రీకాళహస్తి మండలం ఎంపేడుకు చెందిన దివ్యాంగుడు ఈశ్వరయ్యకు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ అధికారి వినోద్ కలిసి సోమవారం ట్రైసైకిల్ అందజేశారు. తాను టేబుల్ ఫ్లవర్స్ వ్యాపారం చేస్తున్నానని, రెండు కాళ్లు లేవని, ట్రైసైకిల్ అందజేస్తే వ్యాపారానికి ఉపయోగపడుతుందని గత పీజీఆర్ఎస్‌లో చేసిన అభ్యర్థనపై స్పందించిన కలెక్టర్ స్పందించి, అందజేశారు.

కులగణనలో న్యాయం చేయండి



షెడ్యూల్ కుల గణనలో ఎస్సీ మాదిగకు బదులుగా ఎస్సీ ఆది ఆంధ్ర, ఎస్సీ ద్రావిడ నమోదు కావడాన్ని సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా పరిగణించాలని ఎమ్మార్పీఎస్ నేతలు నరేంద్రబాబు, గోపి మాదిగ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలో నగరి, సత్యవేడు, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాల్లో దాదాపు 70శాతం మాదిగలను ఎస్సీ ఆది ఆంధ్ర ఉపకులంగా చూపుతున్నారని, తక్షణం సరిదిద్ది ఎస్సీ మాదిగలుగా నమోదు చేయాలని కోరారు.

సోలార్ టాప్‌తో విద్యుత్ ఆదా చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖరరావు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూర్యాఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ విన్నకోటి చంద్రశేఖరరావు విజ్ఞప్తి చేశారు. పాత తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు. గృహాలపై సోలార్ టాప్‌లను అమర్చుకుని విద్యుత్ పొదుపు చేసుకోవాలని కోరారు. రాయితీ పథకాలను వినియోగించుకుంటేమరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. డిప్యూటీ ఈఈ ఆంజనేయులు, జయప్రకాష్, మునిప్రసాద్, రమేష్‌లు, ఏఈలు, సోలార్ రూఫ్‌టాప్ కంపెనీల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు పెరిగాయి

సాధారణ దొంగతనాలు తగ్గాయి
● వివాహేతర సంబంధాలు, కుటుంబ తగాదాతోనే పలు హత్యలు
● ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడి



అధికారులతో కలిసి మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం),డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):'జిల్లాలో ఈ ఏడాది సైబర్ నేరాలు పెరిగాయి.కానీ, పోలీసు శాఖ తీసుకున్న ముందస్తు చర్యలతో సాధారణ నేరాలు తగ్గాయి' అని ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ సావేరి అతిథి గృహంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో వార్షిక నేర గణాంకాలను ఎస్పీ వెల్లడించారు. 2023లో సైబర్ నేరగాళ్లు రూ.2.45 కోట్లు దోచుకోగా.. రూ.84.08 లక్షలు రికవరీ చేశామన్నారు. ఈ ఏడాది రూ.12.89 కోట్లకుగాను రూ.2.36 కోట్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. మొబైల్ హంట్ ద్వారా ఇప్పటి వరకు రూ.7.56 కోట్ల విలువచేసే దాదాపు 4275 సెల్‌ఫోన్లు రికవరీ చేశామన్నారు. జిల్లాపోలీసులు టెక్నాలజీని వినియోగించి ఐదు సంచలనాత్మక కేసులను ఛేదించినట్లు తెలిపారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే దాదాపు 100 బ్లాక్ స్పాట్‌లను గుర్తించామన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన 882 ఫిర్యాదుల్లో 762 పరిష్కరించినట్లు తెలిపారు. పారదర్శకత, పౌర స్నేహక పోలీసింగ్‌ను మెరుగుపరచడానికి 'పోలీసు వెబ్‌సైట్ ప్రారంభించామన్నారు. దొంగతనాలు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, వైట్ కాలర్ నేరాలు, ఇతర నేరాల గురించి గణాంకాల సహా వివరించారు. ఇక, ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ద్వారా ఆరు నెలల్లో దాదాపు 100 కేసులు నమోదు చేసి 2061 దుంగలు.. 108 వాహనాలు సీజ్ చేసినట్లు చెప్పారు. ముగ్గురిపై పీడీ యాక్టు పెట్టామన్నారు. కోర్టు మానటరింగ్ వ్యవస్థ ద్వారా అన్ని శాఖలను సమన్వయం చేసుకోవడంతో పోక్సో హత్యలకు సంబంధించి 13 కేసుల్లో కొందరికి జీవిత ఖైదు, మరికొందరికి ఐదారేళ్ల జైలు శిక్షలు పడ్డాయన్నారు. వివాహేతర సంబంధం, కుటుంబ తగాదాలు, బంధువుల మధ్య గలాటాల కారణంగా చాలావరకు హత్యలు జరిగాయని అభిప్రాయపడ్డారు.

గంజాయిపై ఉక్కుపాదం

ప్రత్యేక టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేసి ఆరు నెలల్లో గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. 85 కేసులు నమోదు చేసి 872.307 కిలోలు, 17 వాహనాలను స్వాధీనం చేసుకుని 223 మందిని అరెస్టు చేశామన్నారు. 239 మందిపై గంజాయి షీట్స్ ఓపెన్ చేశామన్నారు. విద్యా సంస్థల్లో 241 డ్రగ్స్ నిరోధక కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.

వీవీఐపీల భద్రతకు పెద్దపీట

'ఏడాది కాలంలో దాదాపు 1069 మంది వీవీఐపీలు జిల్లాకు వచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా వీరికి భద్రత కల్పించాం. తిరుమల బ్రహ్మోత్సవాలు, శ్రీకాళహస్తి మహాశివరాత్రి ఉత్సవాల్లోనూ భక్తుల మనోభావాలకు భంగం వాటిల్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశాం. తిరుచానూరు ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిగాయని సీఎం చంద్రబాబు అభినందించారు' అని ఎస్పీ పేర్కొన్నారు.

రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం అభినందనీయం



పనిముట్లను పంపిణీ చేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

రేణిగుంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాల ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించడం అభినందనీయమని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రేణిగుంట మండలం కరకంబాడిలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వరిలో డ్రమ్ సీడర్, భూసార పరీక్షా ఆధారిత ఎరువుల యాజమాన్యం, డ్రోన్‌ల వినియోగం, సమగ్ర వ్యవసాయ విధానాలను రైతులకు చేరువ చేయడంలో కేవీకే కృషి అద్భుతమన్నారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఐసీఏఆర్ అటారీ డైరెక్టర్ ఎస్ షేక్‌మీరా, కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రసంగించారు. రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం విత్తనాలు, పనిముట్లను పంపిణీ చేశారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.వెంకటరత్నం, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీయూ

11 అంశాల్లో వర్సిటీకి బహుమతుల పంట



మెడల్స్‌తో ఎస్వీయూ విద్యార్థులు, అధికారులు - ట్రోఫీ అందుకుంటున్న ఎస్వీయూ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత సాంస్కృతిక విజేతగా ఎస్వీ యూనివర్సిటీ నిలిచింది. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా నిర్వహించిన దక్షిణ భారత సాంస్కృతికోత్సవంలో ఎస్వీ యూనివర్సిటీకి చెందిన కళా బృందాలు, విద్యార్థులు పోటీల్లో పాల్గొని ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. క్లే మోడలింగ్‌లో మొదటి స్థానం, పోస్టర్ మేకింగ్‌లో మొదటి స్థానం, ఇన్‌స్టాలేషన్‌లో ద్వితీయ స్థానం, రంగోళిలో ద్వితీయ స్థానం, మెహందీలో ద్వితీయ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో నాల్గవ స్థానం, ర్యాలీలో నాల్గవ స్థానం, డ్యాన్స్‌లో ఐదవ స్థానం, లైట్ ఒకల్‌లో ఐదవ స్థానం, కొల్లేజ్‌లో ఐదవ స్థానం, క్లాసికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో ఐదవ స్థానంలో నిలిచి ఎస్వీయూ విద్యార్థులు బహుమతుల పంట పండించారు. వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు వారిని అభినందించారు. ప్రభుత్వ సహకారంతో వచ్చే ఏడాది యూనివర్సిటీ వేదికగా దక్షిణ భారత సాంస్కృతికోత్సవం నిర్వహిస్తామని అన్నారు.

శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాల ప్రారంభం



తిరుమల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో అధ్యయనోత్సవాలు సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులోభాగంగా రాత్రి 7.30 నుంచి 8.30 గంటలవరకు రంగనాయక మండపంలో కార్యక్రమాలు నిర్వహించారు. ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజుల ముందు నుంచి 25 రోజుల పాటు వీటిని నిర్వహించడం ఆనవాయితీ. కార్యక్రమంలో జీయర్‌స్వాములు, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ పడవ పోటీలకు ఆంధ్రా క్రీడాకారులు



ఢిల్లీకి బయలుదేరిన క్రీడాకారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జనవరి 3-6మధ్యలో జరిగే నేషనల్ డ్రాగన్‌బోట్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 31 మంది క్రీడాకారులు పయనమయ్యారు. శ్రీకాకుళం, విజయనగరం, ఏలూరు, విజయవాడ, నెల్లూరు, కర్నూలు, తిరుపతి జిల్లాల నుంచి డ్రాగన్ బోట్ క్రీడాకారులు వారం రోజులుగా రాయలచెరువులో శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. సోమవారం రాత్రి శ్రీనివాస క్రీడా సముదాయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవినాయుడు క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. జాతీయస్థాయి పోటీలలో రాణించి అధిక పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాధికారి సయ్యద్‌సాహెబ్, ప్రదీప్‌నాయుడు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీటీడీ ఛైర్మన్

తిరుమల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడిని టీటీడీ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు సోమవారం అమరావతిలో కలిశారు. తిరుమలలో భక్తులు గంటల తరబడి క్యూలైన్లు, కంపార్టుమెంట్లలో వేచిఉండే అవసరం లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ద్వారా త్వరితగతిన దర్శనం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్టు సీఎంకు ఆయన వివరించినట్లు తెలిసింది. ఏఐ ఏర్పాటుకు ముగ్గురు నిపుణులతో కూడిన కమిటీని వేయలని సీఎంను కోరగా, సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. అలాగే స్విమ్స్ ఆస్పత్రి నిర్వహణకు టీటీడీ నుంచి ప్రతి ఏడాది రూ.వంద కోట్లు నష్టం వాటిల్లుతోందని, ఆరోగ్యశ్రీ నుంచి రూ.80 కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. అలాగే చిన్నపిల్లల ఆస్పత్రి, స్విమ్స్‌లో నూతన భవనాల నిర్మాణాలు, వాటి ఖర్చుపై సీఎంకు వివరించగా వెంటనే వాటిని నిలిపివేసేలా బోర్డులో నిర్ణయం తీసుకున్నట్టు సీఎంకు ఛైర్మన్ వివరించినట్లు తెలిసింది. ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ, టీటీడీలో అన్యమత ఉద్యోగుల బదిలీ, వీఆర్ఎస్ తదితర అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం.

చెంగాలమ్మ ఆలయ క్యాలెండరు ఆవిష్కరణ



క్యాలెండరు ఆవిష్కరిస్తున్న కొండేపాటి గంగాప్రసాద్, ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, విజయశ్రీ, వాకాటి నారాయణరెడ్డి, ఉయ్యాల ప్రవీణ్

సూళ్లూరుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ క్యాలెండరును కూటమి నాయకులు సోమవారం రాత్రి ఆలయ వద్ద ఆవిష్కరించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త టీడీపీ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్, గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పాశిం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ, ఆలయ ఈవో ప్రసన్నలక్ష్మి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణరెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్ క్యాలెండరను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ తానంకి నానాజీ, టీడీపీ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, పార్థసారథి, ఆకుతోట రమేష్, రఫీ, బొమ్మన పళణి, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ క్యాలెండరు...

వెంకటగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ ఆలయ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. అలాగే డక్కిలి మండలం దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయ క్యాలెండరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, పక్కన కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, సిద్దులయ్యనాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, బెన్నీ

పెళ్లకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తహసీల్దార్ శింగమాల ద్వారకనాథరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని దిగువ చావాలి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగించుకుని తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, బైనా సుబ్రహ్మణ్యం రెడ్డి, యాగాన్ని బెన్నీ, ఆర్ఐ సంతోషీబాయి, వీఆర్వోలు సుదాకర్, కేవీ రమణయ్య, మండల సర్వేయర్ పూజిత, సచివాలయ సర్వేయర్లు సూర్యనారాయణ, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు



ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వామపక్ష నాయకులు అన్నారు. సోమవారం స్థానిక టవర్ క్లాక్ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యసభ సాక్షిగా అంబేడ్కర్‌పై హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు బాధాకరమన్నారు. అమిత్‌షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, కాలేషా, ఎంబేటి చంద్రయ్య, చల్లా వెంకటేశ్వర్లు, జమాలుల్లా, బాబు, జోగి శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల చదువులకు సహకారం

గూడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల చదువులకు బలిజ మహిళా సంక్షేమ సంఘం సహకారం అందిస్తుందని ఆ సంఘ గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక బలిజ మహిళా సంక్షేమ సంఘ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల్లో రాణిస్తున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు, మహిళల సమస్యలను పరిష్కరించేందుకు మహిళా సంక్షేమ సంఘం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో పద్మావతి, ఉమాదేవి, అరుణ, ఉషా, రాధా, సుప్రజ, శిల్పా తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేకుండా రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన



ర్యాలీ చేస్తున్న తహసీల్దారు విజయలక్ష్మి, రీ సర్వే డీటీ నిరంజన్‌కుమార్

చిట్టమూరు, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి తప్పుల్లేకుండా రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన చేస్తామని తహసీల్దారు విజయలక్ష్మి తెలిపారు. సోమవారం జలపెద్దిపాళెంలో రైతులతో కలసి రీసర్వే ప్రాజెక్టును విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రీ సర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం రీ సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా జనవరి 2 నుంచి 120 రోజుల పాటు రెవెన్యూ రికార్డులు ప్రక్షాళన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ నిరంజన్‌కుమార్, మండల సర్వేయర్ వెంకటేష్, వీఆర్వో వెంకటరమణయ్య, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, గ్రామ సర్వేయర్ మౌలాభాషా, రైతులు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

చిల్లకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక 8వ వార్డు సభ్యుడు అన్వేష్ జాతీయస్థాయి రోప్‌జంప్‌కు ఎంపికైన విద్యార్థులకు రూ.10వేల నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు రోప్‌జంప్‌లో జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. వారిని క్రీడల్లో ప్రోత్సహించేలా నగదు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీడీ మస్తాన్‌బీ, విద్యార్థులు పాల్గొన్నారు.

తుఫాన్ షెల్టర్‌కు నూతన భవనం నిర్మించండి

కోట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందపల్లి పాళెంలో ఉన్న తుఫాన్ షెల్టర్ కూలిపోయే పరిస్థితిలో ఉందని సోమవారం మత్స్యకారులు ఎంపీడీవో వేణుకి వినతిపత్రం అందజేశారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన తుఫాన్ షెల్టరు శిథిలావస్థలకు చేరుకోవడంతో వర్షం వస్తే అందులో ఉండలేక పోతున్నామన్నారు. దానికి పడగొట్టి కొత్త భవనం నిర్మించాలని పెదకాపు మస్తానయ్య ఆధ్వర్యంలో మత్స్యకారులు అధికారులను కోరారు.

గల్లంతైన పశువుల కాపరి మృతి




నాగూరయ్య (ఫైల్‌ఫొటో) - మృతదేహం

కోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి స్వర్ణముఖినది వద్ద ఆదివారం గల్లంతైన పశువుల కాపరి యల్లశిరి నాగూరయ్య (47) మృతదేహం సోమవారం లభ్యమైంది. మండలంలోని రుద్రవరం అరుంధతీయవాడకు చెందిన నాగూరయ్య నీళ్ల కోసం నదిలోకి వెళ్లిన పశువులను బయటకు తోలుతుండగా ఇసుక గోతిలో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఆదివారం పొద్దుపోయే వరకు స్వర్ణముఖినదిలో గాలించినా ఆచూకీ లభ్యంకాలేదు. సోమవారం ఉదయం గూడలి వంతెన వద్ద నాగూరయ్య మృతదేహం తేలియాడుతుండటంతో స్థానికులు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు, ఎస్ఐ పవన్‌కుమార్, తహసీల్దారు జయజయరావు సంఘటనాస్థలికి చేరుకొని నాగూరయ్య మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.




రుద్రవరం వద్ద స్వర్ణముఖిలో ఇసుక కోసం తవ్విన గోతులు - స్వర్ణముఖినదిలో ఇసుక గోతులపై పారుతున్న నీళ్లు

మృత్యు కుహరంలా స్వర్ణముఖి

- రుద్రవరం, గూడలివాసులను మింగేస్తున్న గోతులు
- మూడేళ్లలో ఐదుగురి మృత్యువాత
- వైసీపీ నేతల ఇసుక తవ్వకాల పాపం

కోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిధిలోని స్వర్ణముఖి నది మృత్యు కుహరంలా మారింది. గత వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల ఇసుక అక్రమ తవ్వకాలతో స్వర్ణముఖి గోతలమయంగా తయారైంది. నిబంధనలను తూట్లు పొడిచి లక్షలాది టన్నుల ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలించి కోట్లాది రూపాయలు గడించారు. నదిలో ఎక్కడ చూసినా గోతులే ఉండడంతో పరివాహక గ్రామాల ప్రజల ప్రాణాలు తోడేస్తున్నాయి. ముఖ్యంగా రుద్రవరం, గూడలి గ్రామాల ప్రజలు స్వర్ణముఖి నదిలోకి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. రుద్రవరం పంచాయతీలోని ప్రజలంతా స్థానికంగా ఉన్న స్వర్ణముఖినదిని దాటుకొని ఆవలి ఒడ్డుకు చేరుకుంటారు. అక్కడ నుంచి నాయుడుపేట, కోట వైపు వెళ్తుంటారు. ఇక్కడ పంచాయతీకి ఉన్నత పాఠశాల లేకపోవడంతో పిల్లలంతా ఒకటిన్నర కిలోమీటరు ఏరుదాటి ఆవలి ఒడ్డున ఉన్న చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాలలో వెళ్తుంటారు. అయితే వైసీపీ నాయకుల ఇసుక అక్రమ తవ్వకాల పుణ్యమాని స్వర్ణముఖినదిలో భారీగా గోతులు ఏర్పడడంతో పశువుల కాపర్లు మొదలుకొని చిన్న పిల్లల వరకు ఆ గోతుల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. గతంలో ఇద్దరు పశువుల కాపర్లు పశువులను బయటకు తోలేందుకు వెళ్లి గోతుల్లో పడి ప్రాణాలు కోల్పోయారు. అదే విధంగా 10వ తరగతి విద్యార్థి ఏరు దాటుతూ ఇసుక గుంతలో పడి మృతి చెందాడు. అదే విధంగా ఈ ఏడాది మార్చిలో గూడలికి చెందిన మస్తానయ్య ఎడ్లబండి నడుపుకుంటూ నదిలో గోతులోపడి ప్రాణాలు కోల్పోయాడు. తాజాగా ఆదివారం రుద్రవరం అరుంధతీయవాడకు చెందిన నాగూరయ్య నీళ్ల కోసం నదిలోకి వెళ్లిన పశువులను బయటకు తోలుతుండగా ఇసుక గోతిలో పడి గల్లంతైన సంగతి తెలిసిందే. సోమవారం గూడలి వద్ద ఆయన లభ్యమైంది. రైతులు, విద్యార్థులు ప్రాణాలు కోల్పోతుంటే గ్రామాలైన రుద్రవరం, గూడలి గ్రామాల వాసులు స్వర్ణముఖినది అంటేనే హడలిపోతున్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం: టీడీపీ



సదస్సులో మాట్లాడుతున్న చంద్రారెడ్డి, వేదికపై తహసీల్దార్ శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ సర్వేపల్లి రత్నయ్య

డక్కిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా అభివృద్ధి కార్యక్రమాల్లో కూటమి ప్రభుత్వం ముందుంటోందని టీడీపీ నాయకులు డక్కిలి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంథలవారిపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి మేరకు సంక్షేమ పథకాలన్నింటినీ ఒక్కొటిగా అములు చేస్తోందన్నారు. కంథలవారిపల్లికు చెందిన గిరిజనలు గత కొన్నేళ్లుగా సాగు చేసుకొంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గిరిజనులు సాగు చేసుకొంటున్న భూములకు పట్టాలు ఇచ్చేవిషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకొంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజగోపాల్, విద్యాకమిటీ చైర్మన్ రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు మాసాల్లో వెంకటగిరి రూపురేఖలు మారుస్తా: కురుగొండ్ల

వెంకటగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) వచ్చే ఆరు మాసాల్లో వెంకటగిరి రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ వచ్చే ఆరు మాసాల్లో మూడు ప్రధానమైన పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో మట్టిరోడ్లు కనిపించకుండా చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే డక్కిలి మండలంలోని తెలుగుగంగ కాలువ నుంచి డక్కిలి, తురకపల్లి, మోపూరు వద్ద కాలువకు తూములు ఏర్పాటు చేసి 5వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇక వెంకటగిరి మున్సిపాలిటీలో నూతన పైపులైను నిర్మాణం చేపట్టి తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని తెలిపారు.

విశ్వోదయ కళాశాల సమస్యలను పరిష్కరించండి



ర్యాలీ నిర్వహిస్తున్న పీడీఎస్‌వో నాయకులు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 30,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విదార్థి సంఘం(పీడీఎస్‌వో) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో నాయకుడు సీహెచ్ పవన్ మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాలలు 1968లో ప్రైవేటు మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పడగా, 1977లోప్రభుత్వానికి అప్పగించారన్నారు. 2002లో జూనియర్ కళాశాలను విభజించి డిగ్రీ కాలేజీని తిరుపతి రోడ్డులోకి తరలించారని తెలిపారు. 2007లో విశ్వోదయ స్థలాలను కొందరు వేలం పాడుకున్నారన్నారు. ఆ స్థలాలు, భవనాలను జూనియర్ కళాశాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. జూనియర్ కళాశాలకు గదుల కొరత ఉండడంతో కొన్ని తరగతులను పాత భవనంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. అలాగే విద్యార్థులు టెక్నికల్ స్కిల్స్ పెంచుకోవడానికి కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఝాన్సీ, ఏఐవైఎఫ్ నాయకులు సాయికుమార్, పీడీఎస్‌వో నాయకులు హరిప్రసాద్, లీలా మోహన్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

వరిపైరు మేపేశారని ఫిర్యాదు

పెళ్లకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వరిపైరును ఆవులతో మేఇంచేశారని పునబాక గ్రామానికి చెందిన మల్లెమాల మల్లిఖార్జునరెడ్డి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను కౌలుకు సాగు చేస్తున్న 70సెంట్లు వరిపైరును అదే గ్రామానికి చెందిన బత్తెయ్య ఆవులతో మేపించాడని, ఇదేమిటని అడిగితే మరో కయ్యలో ఉన్న వరి పంటను కూడా మేపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుర్రంకొండలో రెవెన్యూ సదస్సు

ఓజిలి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం గుర్రంకొండ, కార్జిమేడు గ్రామాల్లో సోమవారం తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ ఆక్రమణలు, పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతులు అర్జీలు అందజేశారు.

భూ సమస్యలకు పరిష్కారం

నాయుడుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి అన్నారు. నాయుడుపేట మండలం పూడేరులో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో భూ తగాదాలు, సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ అధికారి హరోం హరరావు, ఆర్ఐ సాయితేజ, వీఆర్వో రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తాం

కోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులను మరింతగా ప్రోత్సహిస్తామని టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ అన్నారు. కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ బాలుర జూనియర్ కళాశాల, పాఠశాలల నుంచి సౌత్‌జోన్ క్రీడా పోటీలకు వెళ్లే విద్యార్థులకు సోమవారం జలీల్ అహ్మద్ రూ.15వేల విలువచేసే క్రీడా దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ నారాయణరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి నెల్లూరు మోహన్‌రెడ్డి, పీఈటీ ప్రసాద్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రయోజనకరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కరరెడ్డి

బాలాయపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు ప్రజలకు ప్రయోజనకరంగా ఉండాలని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద అడవులు, చెరువుల్లో గుంతలు తవ్వడం వల్ల నిధులు వృథా అవడం తప్ప ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. అంతకుముందు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వాన పార్వతి, ఎంపీడీవో వినీల్ కుమార్, డీటీ శిరీషా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల్లో డీజేల వినియోగం, బహిరంగ ప్రదేశాల్లో కేక్ కట్ చేయడం, పార్టీలు నిర్వహించడం నిషేధించామన్నారు. అలాగే బైక్‌లలో ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే రూ.10వేల జరిమానా, జైలు శిక్ష ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే నూతన సంవత్సర వేడుకలు

చిట్టమూరు, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకలు నిబంధనల ప్రకారమే జరుపుకోవాలని ఎస్ఐ చిన్న బలరామయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నేటి రాత్రి పోలీసు ఆంక్షలు అమల్లో ఉంటాయని, ఎవరైన నిబంధనలకు వ్యతిరేకంగా వేడుకలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. రాత్రి బైక్‌లపై చక్కర్లు కొడుతూ ప్రజలకు విఘాతం కలిగించిన, బహిరంగ ప్రదేశాల్లో కేక్ కట్ చేస్తూ కేకలు వేయడం, వికృత చేష్టలకు పాల్పడే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. డీజేలు, అసభ్యకరమైన నృత్యాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

తడ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి 11 గంటల తరువాత వాణిజ్య దుకాణాలు మూసివేయాలని, బహిరంగ ప్రదేశాలలో కేక్ కట్ చేసినా, మద్యం సేవించినా, గుంపులుగా తిరిగినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని ఎస్ఐ సూచించారు.

నుడా చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న సుధీర్‌రెడ్డి, సుధీర్, సుబ్బారెడ్డి

నాయుడుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిని సోమవారం నెల్లూరులో టీడీపీ నాయకుడు గూడూరు సుధీర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, చెన్నారెడ్డి సుబ్బారెడ్డి శాలువతో సత్కరించారు.

స్విమ్స్‌లో కార్డియాలజీ పే క్లినిక్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని స్విమ్స్‌లో గుండె సంబంధిత వ్యాధులతో పెరుగుతున్న రోగులను దృష్టిలో పెట్టుకుని కార్డియాలజీ విభాగం వారు సాయంత్రం రెండవ పే క్లినిక్‌ను జనవరి ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపద్మావతి ఓపీడీ బ్లాక్‌లో రూమ్ నెంబరు 17లో కార్డియాలజీ వైద్య నిపుణురాలు డాక్టర్ వనజాక్షమ్మ ఆధ్వర్యంలో పే క్లినిక్‌ను నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

వేడినీళ్లు పడి గాయపడిన చిన్నారి మృతి



వర్షిత(ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, డిసెంబర్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జక్కనవానిపల్లి గొల్లపాళెంలో వేడినీళ్ళు పడి గాయపడిన చిన్నారి సోమవారం మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు... పెట్లాల శ్రీనివాసులు, రేవతి దంపతుల కుమార్తె వర్షిత(3) ఈనెల 25న ఇంట్లో ఆడుకుంటుండగా వేడినీళ్లు పడడంతో శరీరం బాగా కాలిపోయింది. చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు: కురుగొండ్ల



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు వెంకటగిరి డిపో నుంచి కొత్తగా 11 బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సోమవారం డిపోకు కొత్తగా వచ్చిన బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త బస్సులు రాకతో ఇకపై అన్ని మార్గాల్లో సర్వీసులను నడుపుతామన్నారు. వెంకటగిరి నుంచి తిరుపతి, గూడూరు, నెల్లూరు మార్గాల్లో ప్రతి అర్ధ గంటకూ ఒక బస్సు నడుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కేవీకే ప్రసాద్ నాయుడు, పులికొల్లు రాజేశ్వరరావు, గంగాధరం, అవ్వారు సత్యం, పునుగోటి విశ్వనాధనాయుడు, మల్లారం బాబు, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తడ బీజేపీ అధ్యక్షుడిగా తేజారెడ్డి



తేజారెడ్డిని సన్మానిస్తున్న సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, ఆది నారాయణరెడ్డి

తడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తడ మండల బీజేపీ అధ్యక్షుడుగా తేజారెడ్డి నియమితులయ్యారు. సోమవారం అక్కంపేటలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడిగా చిల్లకూరు తేజారెడ్డిని ప్రస్తుత అధ్యక్షుడు రాచర్ల కృష్ణమూర్తి ప్రతిపాదించగా జిల్లా నాయకులు ఆమోదించారు. అనంతరం తేజారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, నాయకులు గోపీ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్ గౌడ్



సూళ్లూరుపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా అత్తిరాల కిరణ్‌కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక రోటరీ హోలులో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ తాడిపర్తి ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర్‌రెడ్డి, తస్నీరు శేషగిరిరావు, శ్రీనివాసులు, కోటయ్యగౌడ్, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఏరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. మొదటి మ్యాచ్ ప్రాస్‌పరో - రత్నం జట్ల మధ్య జరిగింది. ప్రాస్‌పరో జట్టు 51 పరుగులతో విజయం సాధించింది. రెండో మ్యాచ్ నారాయణ - సాయివిద్యానికేతన్ జట్ల మధ్య జరగ్గా నారాయణ జట్టు 45 పరుగుల విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్ వీఎస్ఆర్ - ఆదిశంకర జట్ల మధ్య జరగ్గా ఆదిశంకర జట్టు 12 పరుగులతో, నాలుగో మ్యాచ్ ఎల్‌పీపీ - జీఎస్ఆర్ఎం జట్ల మధ్య మధ్య జరగ్గా ఎల్‌పీపీ 79 పరుగుల తేడాతో విజయం సాధించాయి.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

చిల్లకూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటక్రాస్ రోడ్డు సమీపంలోని నక్కలవారికండ్రి గిరిజన కాలనీకి చెందిన లక్ష్మమ్మకు వైద్యఖర్చుల కోసం సోమవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.15వేలు ట్రస్ట్ సభ్యులు బాబు, భాస్కర్ చేతుల మీదుగా అందజేశారు. లక్ష్మమ్మ గత కొద్ది రోజులుగా క్యాన్సర్‌తో బాధపడుతోంది.